


రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు 2 లో

Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 269 | శనివారం 21 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# యుద్ధం నీడలో రంజాన్ వేడుకలు

- ఆశ్రయాలే పండగ ప్రదేశాలు
- పశ్చిమాసియాలో శిథిల భవనాల మధ్యే ప్రార్థనలు
- ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనాలో మసీదు మూసివేత

టెహరాన్, గాజా - సూర్య వాస్తవం

పశ్చిమాసియా అంతటా దాడులు, ప్రతిదాడులతో ఉద్రిక్తంగా ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో పవిత్ర రంజాన్ వేడుకలు జరిగాయి. ఘర్షణలు, బాంబుల మోతలతో శిథిలాల మధ్యే రంజాన్ (ఈద్ అల్-ఫితర్) జరుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అనేక దేశాల్లో భక్తులు ప్రార్థనల కోసం పెద్ద మసీదులకు చేరుకోగా, పాలస్తీనాలోని గాజాలో కుటుంబాలు తమ చుట్టూ విధ్వంసం ఉన్నప్పటికీ, వీధులను, తాత్కాలిక ఆశ్రయాలను పండుగ ప్రదేశాలుగా మార్చుకున్నారు. సాంప్రదాయకంగా కుటుంబంతో కలిసి విహారయాత్రలకు, కొత్త బట్టలకు సమయమైన ఈద్ పండుగ పశ్చిమాసియా దేశాల్లో వీధులో, శిథిలాల్లో ప్రార్థనలకే పరిమితమైంది. పండుగ వాతావరణం కనబడకుండా అశాంతితో నిండిపోయింది. ఇజ్రాయిల్ ఆక్రమిత తూర్పు జెరూసలేంలో అల్-అక్సా మసీదు మూసివేయడంతో పాలస్తీనియన్లు పాత నగరం గోడల వెలుపల - మిగతా 2లో..




# డ్రగ్స్‌పై బీజేపీ ఎందుకు నోరు మెదపదు?

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసు విషయంలో బీజేపీ ఎందుకు నోరు మెదపటం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. మాదక ద్రవ్యాలను వాడుతూ ఇటీవలే మాజీ ఎమ్మెల్యే, మరో ఎంపీ అడ్డంగా దొరికిపోయారని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మహేశ్ మీడియాతో మాట్లాడుతూ...డ్రగ్స్‌పై తమ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని అన్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కుప్పలు తెప్పలుగా దొరికిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి చెందిన యువ నాయకుడి బృందం - మిగతా 2లో..

# కేంద్రమంత్రికి కర్నాటక సీఎం లేఖ

బెంగళూరు - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌లో తీవ్రంగా గ్యాస్ సంక్షోభం నెలకొంది. గ్యాస్ కొరత వల్ల బెంగళూరులో వ్యాపారాలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ కొరతని తీర్చాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం కేంద్ర పెట్రోలియం శాఖామంత్రికి లేఖ రాశారు. బెంగళూరులో నెలకొన్న గ్యాస్ కొరత ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, గ్యాస్ కొరతను తీర్చడానికి హర్దీప్ సింగ్ పూరి తక్షణమే జోక్యం చేసుకోవాలని సిద్ధరామయ్య తన లేఖలో పేర్కొన్నారు. ప్రాధాన్యతా, నిత్యావసర రంగాలకు సరఫరాను నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. రోజుకు 50 వేల సిలిండర్ల డిమాండ్ ఉండగా... సరఫరా - మిగతా 2లో..





# రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే బడ్జెట్

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చాం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎన్ఈపీకి అనుగుణంగా మార్పులు చేస్తామని వెల్లడి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాబోయే ఆర్థిక సంవత్సరాని(2026-27)కి తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించేదిగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈసారి పద్దులో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు తగు ప్రాధాన్యతనిచ్చామని ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రతిపాదించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి... మీడియాతో ఇష్టాగోష్టిగా - మిగతా 2లో..

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు....

- ముగ్గురి మృతదేహాలు లభ్యం
- అందరూ ఇంజనీరింగ్ విద్యార్థులే
- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలను వెలికితీయగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం, అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉగాది సెలవుల సందర్భంగా విహారయాత్రకు వెళ్లారు. భద్రాచలం సందర్శన అనంతరం ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. నది లోతుపై అవగాహన లేకపోవడంతో నీటి ప్రవాహానికి ఐదుగురు కొట్టుకుపోయారు. మరో ఇద్దరు విద్యార్థులు చాకచక్యంగా ఒడ్డుకు చేరుకున్నారు.

సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు - మిగతా 2లో..





# ఒత్తిడికి లొంగం 2 లో

- యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా అభ్యర్థనకు శ్రీలంక నో
- ట్రంప్ వ్యూహాలకు దిసనాయకే బ్రేక్

# పంట నష్టంపై 2 రోజుల్లో నివేదిక

-- గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం వద్దు-- సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి - సూర్య వాస్తవం

అకాల వర్షాలు, వడగళ్ల వాన, ఈదురు గాలులతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ - మిగతా 2లో..






# ఇది నిరుద్యోగులను వంచించడమే..

- చంద్రబాబుది పచ్చి మోసం
- ఏపీ జాబ్ క్యాలెండర్‌పై షర్మిల ఫైర్

అమరావతి - సూర్య వాస్తవం

ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం 10,060 పోస్టులతో క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగ యువతను నమ్మించి నయవంచన చేశారని ఆమె ఆరోపించారు. - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు....

(మొదటిపేజీ తరువాయి)

పడవల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సి. శ్రీకర్ (భద్రాచలం), పి. అభిరామ్ (విజయనగరం), నవదీప్ (ఉయ్యూరు) మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన గోక తేజ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లె) కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిని చందూరి దీపక్, గడ్డం హర్షవర్ధన్‌గా గుర్తించారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు ముమ్మరం చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# డ్రగ్స్‌పై బీజేపీ ఎందుకు నోరు మెదపదు?

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం ఈ కార్యకలాపాల్లో మునిగి తేలుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది ఫామ్ హౌజ్‌లో దొరికితే, ఆయన సన్నిహితుడు దుబాయ్‌కు పారిపోయాడని గుర్తు చేశారు. మరికొందరి నేతల వ్యవసాయ క్షేత్రాల్లో కోళ్ల పందాలు నడుస్తున్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా బీజేపీ నేతలకు ఎందుకు పట్టటం లేదని నిలదీశారు. త్వరలోనే బీఆర్ఎస్.. బీజేపీలో కలవనుందని, అందుకే కమలం పార్టీ నేతలు డ్రగ్స్ వ్యవహారంలో పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**డిప్యూటీ సీఎం కుమారుడి రిసెప్షన్‌కు సీఎం**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్యకు ఇటీవల వివాహమైన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆయన వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులను ఈ సందర్భంగా సీఎం ఆశీర్వదించారు.

# కేంద్రమంత్రికి కర్నాటక సీఎం లేఖ

(మొదటిపేజీ తరువాయి)

కేవలం వెయ్యి సిలిండర్లకే పరిమితం కావడంతో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. దీనివల్ల వ్యాపారాలు, హోటళ్లు మూతపడుతున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా గ్యాస్‌ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సిద్ధరామయ్య తన లేఖలో కేంద్ర మంత్రిని కోరారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు

# రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశామన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి అనుగుణంగా వివిధ రంగాలకు నిధులను కేటాయించామని తెలిపారు. అన్ని వర్గాలను సంతృప్తి పరిచే విధంగా పద్దును రూపొందించామని వివరించారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి జీవిత బీమాను ప్రవేశపెట్టామని వెల్లడించారు. తద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల బీమాను అందించబోతున్నామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 1.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలకు, ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక నిధులు కేటాయించామని చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో కూడా మార్పులు తీసుకొస్తామని స్పష్టం చేశారు. ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టు వరకు విద్యార్థులు ఒకే చోట ప్రభుత్వ స్కూళ్లలో చదివే విధంగా నూతన విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. అప్పులు, ఆదాయాలకు సంబంధించిన అన్ని అంశాలను పారదర్శకంగా బడ్జెట్‌లో పొందుపరిచామని సీఎం చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజా ప్రభుత్వం చేసిన అప్పు రూ.3.47లక్షల కోట్లని వివరించారు. ఇందులో నుంచి గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే 3.30 లక్షల కోట్లు చెల్లించామన్నారు. వివిధ విభాగాల్లో ఉన్న లీకేజీలను అరికట్టటం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబడతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదముద్ర...**

కాగా రాష్ట్ర బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శుక్రవారం ఉదయం 10.15 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ ప్రారంభమైంది. పద్దుపై వెంటనే చర్చించి, ఆమోదముద్ర వేశారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

**అమరావతి - సూర్య వాస్తవం**

పవిత్ర రంజాన్ (మార్చి 21) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని ముస్లిం సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. "పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశం. పేదలకు దానం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుంది. ఈ రంజాన్ మీ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించి, మీ కోరికలు అన్నీ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంటూ.... ఈద్ ముబారక్" అంటూ చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

# యుద్ధం నీడలో రంజాన్ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రార్థనలు చేశారు. బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడుల కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలు వీధి గుడారాలలో ఈద్ పండుగను జరుపుకున్నారు. భారత్, శ్రీలంక వంటి దేశాల్లో రంజాన్ పండుగను శనివారం జరుపుకోనుండగా, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలతోపాటు మధ్య ఆసియా, ఆగేయా సియా, ఆఫ్రికాల్లోని దేశాల్లో శుక్రవారమే ముస్లిములు రంజాన్ పండుగ నిర్వహించుకున్నారు. రంజాన్ నెలలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉపవాస దీక్షలను శుక్రవారం నాడు పవిత్ర ప్రార్థనలతో ముస్లిం సోదరులు విరమించారు. ఈ వేడుక రెండు రోజుల పాటు కొనసాగుతుంది. నెలవంక దర్శనంతో రంజాన్ ఉపవాస దీక్షలను ముగించి, పవిత్ర ప్రార్థనలు చేస్తారు. తరువాత రోజు ఈద్ పండుగను జరుపుకుంటారు. నెలవంకను ప్రత్యక్షంగా చూడటంపై ఈ పండుగ తేదీ ఆధారపడటం వలన ప్రాంతాన్ని బట్టీ సమయం మారుతుంది. ఫలితంగా మాలి, నైజర్, ఆఫ్ఘనిస్తాన్ వంటి పలుదేశాల్లో గురువారమే ఈద్ పండుగను జరుపుకున్నారు. సూడాన్‌లో గత మూడేళ్లగా అంతర్యుద్ధం కొనసాగుతోంది.

**రంజాన్ రోజూ దాడులు**

అమెరికా, ఇజ్రాయిల్ దాడులు రంజాన్ రోజూ కొనసాగాయి. ఇరాన్ రాజధాని టెహరాన్‌పై నివాస స్థలాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. నేలమట్టమైన ఊర్లు, శిథిల భవనాల్లో వీటిని శుక్రవారం నిర్వహించుకున్నారు. పశ్చిమాసియా మాత్రమే కాకుండా పాలస్తీనా, లెబనాన్లపై ఇజ్రాయిల్ దాడులతో ఈ ప్రాంతం కూడా మరుభూమిగా మారింది. దాడుల్లో నివాసాలు నేలమట్టం కావడంతో రహదారుల పక్కన, వీలున్న ఖాళీ ప్రాంతాల్లోనే ప్రార్థనలు జరిపారు.

**ఆసీస్ ప్రధానిని నిలదీసిన ప్రజలు**

**సిడ్నీ :** ఈద్ అల్ ఫితర్ ప్రార్థన కోసం మసీదుకు వచ్చిన ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంటోని అల్బనీస్‌ను స్థానిక ప్రజలు నిలదీశారు. గాజాలో మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతు పలకంపై ప్రధాన్ని తీవ్రంగా ప్రశ్నించారు.

మసీదు నుంచి 'బయటకు వెళ్లండి' అని పదేపదే నినాదాలు చేశారు. ఆస్ట్రేలియాలో అతిపెద్ద మసీదైన సిడ్నిలోని లకెంబా మసీదు వద్దకు ప్రార్థనల కోసం శుక్రవారం ప్రధాని అల్బనీస్, హోం మంత్రి టోరీ బర్క్ వచ్చినప్పుడు ఈ సంఘటన జరిగింది. సుమారు 30 నిమిషాల పాటు స్థానికులు ప్రధాని, హోం మంత్రిని అడ్డగించారు. వారికి అంతరాయం కలిగించారు.

# ఇది నిరుద్యోగులను వంచించడమే..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఖాళీలుంటే, ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల సంఖ్య "ఖాళీలు బారెడు.. నోటిఫికేషన్లు చారెడు" అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఉగాది రోజున సీఎం చంద్రబాబు 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. మే 15 నుంచి అక్టోబరు వరకు ఈ నియామకాలు పూర్తి చేస్తామని, ఇకపై ప్రతి ఏటా ఉగాదికి క్యాలెండర్ ఇస్తామని ప్రకటించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వ ప్రకటనపై షర్మిల ఘాటుగా స్పందించారు. "కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లు" కూటమి ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో చంద్రబాబు చేసింది పచ్చి మోసమని, ముష్టి 10 వేల పోస్టులకు షెడ్యూల్ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రెండేళ్లుగా నిరుద్యోగులను ఊరించి చివరకు ఉసూరుమనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల్లోని ఖాళీలపై ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. "విద్యాశాఖలో 30 వేలు, పోలీస్ శాఖలో 19,999, ఇంజనీరింగ్ విభాగంలో 20 వేలు, పంచాయతీ రాజ్‌లో 26 వేలు, మున్సిపల్ శాఖలో 27 వేలు, రెవెన్యూలో 13 వేలు, వైద్యశాఖలో 26 వేల ఖాళీలను వెంటనే నింపుతామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలోని 153 విభాగాల్లో కలిపి 1.80 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రెండేళ్లకు కలిపి కనీసం 50 వేల ఉద్యోగాలనైనా భర్తీ చేయాల్సి ఉందని ఆమె అన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులున్న రాష్ట్రంలో ఇలాంటి క్యాలెండర్లు కాకుండా భారీ స్థాయిలో ఖాళీలను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. అలాగే, ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల దరఖాస్తుకు వయోపరిమితిని 42 నుంచి 46 ఏళ్లకు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి ఎదురుచూస్తున్న యువతకు న్యాయం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

# పంట నష్టంపై 2 రోజుల్లో నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంట నష్టంపై అధికారులను సిఎం చంద్రబాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. రూ.40 కోట్ల వరకూ నష్టం జరిగినట్లు అంచనా వేశారు. 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా వర్షాలు ప్రభావం ఉందని తెలిపారు. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, నిమ్మ పంటలు దెబ్బతినగా, నష్టం విలువ రూ.23 కోట్ల వరకూ ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ వేసిన అంచనాల ప్రకారం అన్ని పంటలకూ కలిపి మొత్తం నష్టం రూ.63 కోట్లుగా అధికారులు లెక్క తేల్చారు. మరోవైపు ఎల్‌పిజి సరఫరాపైనా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు.

ఇరాన్ -- ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరికొన్నాళ్లు యుద్ధం కొనసాగితే.. ఎల్‌పిజి గ్లోబల్ సప్లరు చైన్ దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులకు సూచించారు. ఎక్కడా ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ -- గిరిజన ప్రాంతాలు, విద్యా సంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ డెలివరీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఇండక్షన్ స్టవ్‌లు, పిఎన్‌జి వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# ఒత్తిడికి లొంగం

**- యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా అభ్యర్థనకు శ్రీలంక నో**

**- ట్రంప్ వ్యూహాలకు దిసనాయకే బ్రేక్**

**కొలంబో- సూర్య వాస్తవం**

శ్రీలంకలోని మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయంలో తమ రెండు యుద్ధ విమానాలను దించేందుకు అమెరికాకు శ్రీలంక అనుమతి నిరాకరించిందని అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే శుక్రవారం కొలంబోలోని పార్లమెంటులో తెలిపారు. ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్‌ల మధ్య కీలకమైన సముద్ర మార్గమైన జిబౌటిలో ఉన్న అమెరికా యుద్ధ విమానాల నుంచి మార్చి 4, 8 తేదీల్లో ఈ అభ్యర్థనలు రాగా..ఆ రెండింటినీ తిరస్కరించామన్నారు. "జిబూటీలోని స్థావరం నుంచి ఎనిమిది నౌకా విధ్వంసక క్షిపణులతో కూడిన రెండు యుద్ధ విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకురావాలని అమెరికా కోరింది. కానీ మేం నిరాకరించాం" అని ఆయన అన్నారు. అదే విధంగా "ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ మేం మా తటస్థతను కొనసాగించాలనుకుంటున్నాం. మధ్యప్రాచ్య యుద్ధం సవాళ్లను విసురుతోంది. కానీ మేం లొంగిపోం. " అని దిసనాయకే అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమాసియా సంఘర్షణలోకి లాగబడకుండా ఉండాలన్న కొలంబో ఉద్దేశాన్ని ఆయన ఈ విధంగా స్పష్టం చేశారు. దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా ప్రత్యేక రాయబారి సెర్గియో గోర్‌తో సమావేశమైన తర్వాత దిసనాయకే ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారిక ప్రకటన ప్రకారం.. కీలకమైన సముద్ర మార్గాలను పరిరక్షించడం, ఓడరేవులను సురక్షితం చేయడం, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం, స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో-పసిఫిక్‌ను ముందుకు తీసుకెళ్లడంపై చర్చలు జరిగాయి. అయితే ఈ చర్చలు జరిగినప్పటికీ, తమ తటస్థ వైఖరికి భంగం కలిగించే బాహ్య ఒత్తిళ్లను ప్రతిఘటిస్తామని శ్రీలంక నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. హిందూ మహాసముద్ర ప్రాంతమంతటా, ముఖ్యంగా మధ్యప్రాచ్య సంఘర్షణ యొక్క దుష్ప్రభావాల కారణంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో, శ్రీలంక అనుసరిస్తున్న జాగ్రత్తతో కూడిన సమతుల్య చర్యను ఈ తిరస్కరణ స్పష్టం చేస్తుంది. అమెరికా సైనిక విమానాలకు ఆతిథ్యం ఇవ్వకూడదని కొలంబో తీసుకున్న నిర్ణయం, సైనిక కార్యకలాపాలలో చిక్కుకుపోతామనే లేదా ఒక పక్షానికి వత్తాసు పలుకుతున్నట్టుగా ప్రజలు భావిస్తారనే ఆందోళనలను ప్రతిబింబిస్తుంది.

**వివాదంలో ఐరిస్ దేనా**

హిందూ మహాసముద్రంలో శ్రీలంక దక్షిణ తీరంలో ఇటీవల ఒక సముద్ర ప్రమాదం నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మార్చి 4న, గాలే సమీపంలో ఒక అమెరికా జలాంతర్గామి ఇరాన్ ఫ్రిగేట్ 'ఐరిస్ దేనా'పై టార్పెడో దాడి చేసింది. ఈ ఘటనలో 84 మంది నావికులు మరణించారు. మరో 32 మందిని శ్రీలంక నావికాదళం రక్షించింది. భారతదేశంలో జరిగిన నావికా విన్యాసాల నుంచి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగిందని సమాచారం. ఈ ఘటన అనంతరం 219 మంది సిబ్బందితో ఉన్న మరో ఇరాన్ నౌక, 'ఐరిన్స్ బుషెహర్', కొలంబో ఓడరేవులోకి ప్రవేశించడానికి ప్రయత్నించింది. శ్రీలంక అధికారులు ఆ నౌకను తూర్పున ఉన్న ట్రింకోమలీ ఓడరేవుకు మళ్లించారు. ఆ సిబ్బందిలో 204 మంది నావికులకు ప్రభుత్వం తాత్కాలిక ప్రవేశ వీసాలు మంజూరు చేసి, కొలంబో సమీపంలోని ఒక నావికా కేంద్రంలో వసతి కల్పించింది. ఈ ఘటన.. అంతర్జాతీయ సముద్ర ప్రవర్తనపైనా, అగ్రరాజ్యాల మధ్య వైరుధ్యాల మధ్య చిక్కుకున్న చిన్న దేశాలకు ఎదురయ్యే ప్రమాదాలపైనా శ్రీలంకలో చర్చకు దారితీసింది. అంతర్జాతీయ నిబంధనల ఉల్లంఘనలు, ప్రాంతీయ స్థిరత్వంపై పడే సంభావ్య పరిణామాలపై చట్టసభ సభ్యులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీలంక నాయకత్వం కూడా విస్తృత సంఘర్షణ వల్ల కలిగే ఆర్థిక పరిణామాలను గుర్తించింది. ద్వీప ఆర్థిక వ్యవస్థకు కీలక స్తంభాలైన ఇంధన సరఫరా, విదేశాల నుంచి వచ్చే డబ్బు, పర్యాటకం వంటి వాటికి అంతరాయాలు కలగడం ఇందులో భాగం. ఈ ఒత్తిళ్లు తటస్థత, అలీన విధానంపై కొలంబో యొక్క ప్రాధాన్యతను మరింత బలపరిచాయి. ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, అమెరికా యుద్ధ విమానాలను దిగడానికి అనుమతించని శ్రీలంక దృఢమైన నిరాకరణ, సార్వభౌమాధికారానికి భంగం కలగకుండా లేదా సైనిక చర్యలకు వేదికగా మారకుండా అస్థిరమైన భౌగోళిక రాజకీయ వాతావరణాన్ని ఎదుర్కోవడానికి అది చేస్తున్న ప్రయత్నాన్ని స్పష్టం చేస్తుంది.

# సంపాదకీయం

## ముందస్తు చర్యలతో భారత్ స్థిరం




గల్ఫ్ యుద్ధం కారణంగా అత్యంత ప్రభావితం అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటి. మన దేశంలో చమురు, ఎల్‌పీజీ వినియోగం పెరిగిన కారణంగా మన గల్ఫ్ దేశాలపై ఆధారపడి ఉన్నాం. దీంతో మనం కూడా ప్రభావితం అవుతున్నాం. 90 శాతం చమురు, ఎల్‌పీసీ 60 శాతం, ఎల్ఎన్‌జీ 50 శాతం దిగుమతి చేసుకుంటున్నాం. పూర్తిగా గల్ఫ్‌గా, చమురు ఉత్పత్తి దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నా. బ్యాదల్ మాండెల్, ఆర్మ్యూజ్ జలసంధిలో ఇబ్బందులు వచ్చినా ప్రభావితం అవుతున్నాం. కానీ తట్టుకుని నిలబడుతున్నాం.భారత్ గల్ఫ్ దేశాల నుంచి 90% క్రూడ్ ఆయిల్, 60శాతం ఎల్‌పీజీ, 50శాతం ఎల్ఎన్‌జీ దిగుమతి చేస్తోంది, ఇది రోజువారీ వినియోగాన్ని 5 మిలియన్ బ్యారెళ్లకు చేర్చింది. బ్యాబ్ ఎల్ మండబ్, స్ట్రెయిట్ ఆఫ్ హార్మ్యూజ్ జలసంధుల్లో దాడులు జరిగినా, రోజుకు 7, 8 మిలియన్ బ్యారెళ్ల సరఫరా దెబ్బతింటుంది. ధరలు 20శాతం పెరిగి బ్యారెల్‌కు 95 డాలర్లు దాటింది. దీని వల్ల దిగుమతి ఖర్చు వారానికి రూ.15 వేల కోట్లు పెరిగింది. భారత్ ముందస్తున ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఎక్కువ నిల్వలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 25 రోజులకు సరిపోయే క్రూడ్ నిల్వలు, ఎల్‌పీజీ 30 రోజులకు, పెట్రోల్, డీజిల్ 25 రోజులకు, ఎల్ఎన్‌జీ పది రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వీటిని జాగ్రత్తగా వాడుకోవడం ద్వారా ప్రస్తుతం క్రైసిస్ నుంచి బయటపడే వీలు ఉంటుంది.భారత్ మూడు రకాలుగా ప్రయత్నం చేస్తోంది. వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందిస్తోంది. రష్యా నుంచి 30 బిలియన్ బ్యారెళ్ల ఇంధనం దిగుమతి చేసుకుంటున్నాం. అంగోలా నుంచి 3.4 మిలియన్ బ్యారెళ్లు, కాంగో నుంచి 1.3 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం. వీటిద్వారా మనపై యుద్ధ ప్రభావం తగ్గించుకుంటున్నాం. ఒక దేశంపై ఆధారపడకుండా 40 దేశాల నుంచి చమురు కొంటున్నాం. ప్రస్తుతం యుద్ధం జరుగుతున్న గల్ఫ్ దేశాల నుంచి 70 శాతం చమురు ఆగిపోయింది. అయినా ఇబ్బంది లేదు. దౌత్యపరంగా ఇరాన్‌తో మాట్లాడడంతో మన ఓడలు సురక్షితంగా భారత్‌కు వస్తున్నాయి.మోదీ అదికారంలోకి వచ్చాక మన స్ట్రాటజిక్ రిజర్వులు పెంచేందుకు ఇండియన్ స్టాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ అనే కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. దేశంలో మూడు ప్రాంతాల్లో చమురు నిల్వ చేస్తోంది. అండర్‌గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున చమురు నిల్వలు చేస్తోంది. భూమి ఉపరితలం నుంచి 500 మీటర్ల లోపల స్టోరేజీ కెపాసిటీ ఉంది. 10 ఏళ్ల క్రితం విశాఖపట్టణంలో ఏర్పాటు చేశారు. తర్వాత తమిళనాడులోని పాదూర్‌లో రిజర్వులు ఏర్పాటు చేశారు. కర్ణాటకలోని మంగళూరులో కూడా నిర్వలు ఏర్పాటు చేశారు. విశాఖపట్టణంలో 60 మిలియన్ టన్నుల నిల్వల సామర్థ్యం ఉంది. మంగళూరులో 20 వేల టన్నులు, పాదూరులో కూడా 20 వేల టన్నులు నిల్వ సామర్థ్యం ఉంది.వార్షికంగా మనకు 31 మి.టి ఎల్‌పీజీ అవసరం ప్రస్తుతం 20శాతం కొరత ఉన్నా, కమర్షియల్ (హోటల్స్, ఇండస్ట్రీలు) వాడకంపై 25శాతం కోత పెట్టి 80శాతం గృహావసరాలు (10 మి.టి.) రక్షించారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ కనెక్షనుల గణనీయంగా ఇచ్చారు. ప్రస్తుతం 33 కోట్ల కనెక్షన్లు ఉన్నాయి. బాటలింగ్ స్టేషన్లు 23 మెట్రిక్ టన్నులకు పెంచారు. ఈ స్టేషన్లు 186 నుంచి 210కి పెంచాం. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు 13 వేల నుంచి 25 వేలకు పెరిగారు. వాడకం పెరిగింది. అందుకు తగినట్లుగా ఉజ్వల్ యోజన కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. ఒడిదుడుకులు ఉన్నా భారత్ తట్టుకుంటోంది.మిగతా దేశాలతో పోలిస్తే మనం ప్రభావితం కావడం లేదు. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ మాత్రం తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. మోదీ ప్రభుత్వ ముందచూపు ఇప్పుడు మనల్ని సురక్షితంగా ఉంచింది.


పెరుగుతున్న ఇంధన ధరలు, అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న పరిణామాల నేపథ్యంలో, కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గ్యాస్ వినియోగాన్ని పొదుపుగా చేయాలని ఆమె చేసిన సూచనలు ఆసక్తిని రేపుతున్నాయి. ప్రజలు గ్యాస్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని కోరారు. ఇది కేవలం ఆర్థిక పొదుపు కోసమే కాకుండా, దేశ ఇంధన భద్రత దృష్ట్యా కూడా అవసరమని ఆమె పేర్కొన్నారు.ఉక్రెయిన్-రష్యా, ఇరాన్-అమెరికా మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా సహజ వాయువు సరఫరాపై ప్రభావం పడింది. దిగుమతి చేసుకునే గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వంపై భారం పడుతోంది. దేశీయంగా గ్యాస్ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలంటే వినియోగదారులు కూడా తమ వంతు బాధ్యతగా అనవసర వినియోగాన్ని తగ్గించాలని ఆమె సూచించారు. వంట గ్యాస్ పై ఆధారపడటం తగ్గించి, సౌర శక్తి లేదా ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ప్రజలు మళ్లాలని ఆమె కోరారు.పారిశ్రామిక రంగంలో కూడా గ్యాస్ వాడకంలో అత్యాధునిక సాంకేతికతను వాడి వృథాను అరికట్టాలని ఆమె కోరారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యుడికి భారంగా మారాయని, ఇలాంటి సమయంలో వినియోగం తగ్గించుకోమనడం ఎంతవరకు సమంజసం అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పొదుపు పాటించడం మంచిదేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి వచ్చిన ఈ సూచన, రాబోయే రోజుల్లో ఇంధన కొరత ఏర్పడే అవకాశం ఉందనే సంకేతాన్ని ఇస్తోంది. అటు ప్రభుత్వం సబ్సిడీల భారాన్ని తగ్గించుకోవాలని చూస్తుంటే, ఇటు సామాన్యుడు మాత్రం ధరల సెగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు




# ఇరాన్‌తో ఉత్తరకొరియా....

**టెహ్రాన్ - సూర్య వాస్తవం**

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం మొదలై 18 రోజులైంది. ఇంతకాలం కొనసాగుతుందని ఎవరూ ఊహించలేదు. ఇంతలా ప్రతిఘటిస్తామని ఇరాన్, ఇంతకాలం యుద్ధం చేయాల్సి వస్తుందని అమెరికా కూడా అంచనా వేయలేదు. కానీ ఇరాన్ అమెరికాను భయపెడుతోంది. వ్యూహాత్మకంగా అమెరికాను దెబ్బతీస్తోంది. అమెరికాపై ఒత్తిడి తెస్తోంది. ఈ తరుణంలో హార్మ్యూజ్ జలసంధి వద్ద నౌకలు నిలిచిపోయాయి. ఇలాంటి తరుణంలో యురోపియన్ యూనియన్ దేశాలకు చమురు సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో అమెరికా యుద్ధంతో తమతో కలిసి రావాలని నాటో దేశాలను కోరింది. అయినా ఎవరూ ముందుకు రావడం లేదు.ఈ వార్‌లోకి ఉత్తర కొరియా ఎంటర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే యుద్ధం లక్ష్యం ఏమిటో ఎన్నాళ్లు కొనసాగుతుందో అమెరికా అంచనా వేయలేకపోతోంది. ఈ తరుణంలో ఉత్తర కొరియా రంగంలోకి దిగితే అమెరికాకు ఇబ్బందలు తప్పవు. ఎందుకంటే ఉత్తర కొరియా అణ్వాయుధ దేశం. దక్షిణ కొరియా అమెరికా మిత్ర దేశం దీనికి ఉత్తర కొరియాతో ఇబ్బందులు ఉన్నా అమెరికా ఆ దేశంపై దాడి చేయకపోవడానికి కారణం అణ్వాయుధ మేయుద్ధం జరుగుతున్న వేళ ఇరాన్ 'డ్యాన్సింగ్ మిస్సైల్' ప్రయోగం (10 వేల కి.మీ. రేంజ్, అర్బిటల్



ట్రాజెక్టరీ)తో కొత్త ఆయుధాలు ప్రదర్శించి అమెరికా ఆధిక్యతను సవాల్ చేస్తోంది. ట్రంప్ అనుకోని ఈ దీర్ఘయుద్ధం ఖర్గ్ ఐలాండ్ దాడులు (అమెరికా చమురు మౌలిక సదుపాయాలపై)తో మరింత తీవ్రమైంది. మరోవైపు ఇరాన్ సౌదీ అరేబియాలోని అమెరికా ఎయిర్ బేస్‌లో 5 ట్యాంకర్ షిప్‌లు ధ్వంసం చేసి యుద్ధ విమానాల ఇంధన సరఫరా (గాల్లో నింపుదల) ఆపేశారు. ఈ ఆకస్మిక దాడి అమెరికా ఆపరేషన్ 'ఎపిక్ ఫ్యూరీ'ను ఆపేసి, విమానాలు లక్ష్యాలకు చేరుకోలేకపోయాయి. ఐఆర్‌జీసీ 5 వేల బాంబుల దాడులకు ప్రతిఘటనగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, మోజ్తాబా ఖమేనీపై బెదిరింకపత్రాలు జారీ చేసింది.ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వీడియో ఒకటి తాజాగా వైరల్ అవుతోంది. అందుతో నెతన్యాహు కుడి చేరితికి ఆరు వేళ్లు ఉన్నట్లు గుర్తించారు. దానిని వైరల్ చేస్తున్నారు. ఇది పూర్తిగా ఏఐ వీడియో అని పేర్కొంటున్నారు. ఇరాన్ దాడిలో నెతన్యాహు మరణించాడని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. బతికే ఉన్నాడని ఇజ్రాయెల్ తెలిపింది. తాజాగా మరో రెండు వీడియోలను విడుదల చేసింది. మరోవైపు అమెరికా ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీని చంపుతామంటోంది. నెతన్యాహును చంపుతామని ఐఆర్‌జీసీ ప్రకటించింది.ట్రంప్ తాజాగా 'ఇరాన్‌ను చితక్కొట్టాము' అని ప్రకటించి నాటో సహాయం కోరాడు, కానీ ఎవరూ స్పందించలేదు ? కొందరు 'రామని' చెప్పారు. అమెరికా ట్రిలియన్ డాలర్ సైనిక బడ్జెట్‌కు ఉన్నప్పటికీ, 100 డ్రోన్ దాడికి 16 కోట్లక్షాలర్ల ఖర్చు అమెరికాపైఉ ఆర్థిక ఒత్తిడి సష్టిస్తోంది. ఈ ఒంటరితనం అమెరికా వ్యూహాన్ని మార్చేస్తోంది.ఉత్తర కొరియా మద్దతుతో ఇరాన్ ఐఆర్‌జీసీ యుద్ధం దీర్ఘకాలం సాగేలా చూస్తున్నాయి. రష్యా, చైనా సహకారం (డ్రోన్‌లు, ఇంటెల్) పెరిగితే మహాయుద్ధంగా మారవచ్చు. రెండు?మూడు రోజుల్లో నాటో స్పందనలు కీలకం ? ట్రంప్ ?ఖ?టర్న్ (యుద్ధ ముగింపు సూచనలు) శాంతి చర్చలకు దారి తీయవచ్చు.

# కాంగ్రెస్‌కు డూ ఆర్ డై



**తిరువనంతపురం- సూర్య వాస్తవం**

కేరళ రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పార్టీ ఒక అసాధారణ గండం ఎదుర్కొంటోంది. దశాబ్దాలుగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి అధికారం మార్పిడి జరిగే సంప్రదాయానికి గత ఎన్నికల్లో తెరపడింది. ఎల్‌డీఎఫ్ వరుసగా రెండోసారి పీఠాన్ని దక్కించుకోవడంతో, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రాబోయే ఎన్నికలు కేరళ కాంగ్రెస్‌కు కేవలం అధికారం కోసం మాత్రమే కాదు, ఆ పార్టీ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న జీవన్మరణ పోరాటం.కేరళలో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాయి. సాధారణంగా అధికారం మారు తుందన్న ధీమాతో ఉన్న కాంగ్రెస్, క్షేత్రస్థాయిలో లెఫ్ట్ కూటమి వ్యూహాలను అంచనా వేయడంలో విఫలమైంది. పినరయి విజయన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ముఖ్యంగా విపత్తుల సమయంలో వారు చూపిన చొరవ ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత విభేదాలు, బలమైన నాయకత్వం లేకపోవడం ఆ పార్టీని ప్రతిపక్షానికే పరిమితం చేశాయి.రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలిచారు. ఇప్పుడు ప్రియాంకా గాంధీ ఎంపీగా ఉన్నారు. ఆమె కేరళ రాజకీయాల్లో చురుగ్గా జోక్యం చేసుకోవడం వల్ల ఈ ఎన్నికల ఫలితాలు నేరుగా గాంధీ కుటుంబంపై ప్రభావం చూపుతాయి. దక్షిణాదిలో కర్ణాటక, తెలంగాణ తర్వాత కాంగ్రెస్‌కు బలమైన పట్టున్న రాష్ట్రం కేరళ. ఇక్కడ కూడా వరుసగా మూడో సారి ఓడిపోతే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వ సామర్థ్యంపై , గాంధీ వారసుల విన్నింగ్ కెపాసిటీ పై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తుతాయి.కేరళలో ఇప్పటివరకు ప్రధాన పోటీ కాంగ్రెస్, లెఫ్ట్ కూటముల మధ్యే ఉన్నప్పటికీ, ఈసారి సీన్ మారుతోంది. కాంగ్రెస్ బలహీనపడితే ఆ ఖాళీని భర్తీ చేసేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇప్పటికే క్రైస్తవ సామాజిక వర్గాలను ఆకర్షించడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌లో చీలిక వస్తే, అది బీజేపీకి వరంగా మారుతుంది. త్రిముఖ పోటీ ఏర్పడితే అది కాంగ్రెస్‌కు మరింత నష్టదాయకంఒకవేళ ఈసారి కూడా కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకోలేకపోతే, కేరళలో ఆ పార్టీ బెంగాల్ లేదా త్రిపుర తరహాలో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. కార్యకర్తల్లో నైతిక స్థైర్యం దెబ్బతినకుండా ఉండాలంటే విజయం తప్పనిసరి. అందుకే ఈసారి అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు హైకమాండ్ ప్రత్యేక దృష్టి సారించింది. లెఫ్ట్ కూటమిని ఎదుర్కోవడానికి మతపరమైన సమీకరణాలను, యువ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపైనే కాంగ్రెస్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కేరళ ఎన్నికలు దేశ రాజకీయాల్లోనే అత్యంత కీలకంగా మారాయి. పినరయి విజయన్ హ్యాట్రిక్ కొడతారా? లేక కాంగ్రెస్ తన పాత వైభవాన్ని చాటుకుంటుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరం. కాంగ్రెస్‌కు ఇది ఇప్పుడు కాకపోతే ఇంకెప్పటికీ కాదు అనే పరిస్థితి. ఈ పోరులో గెలిస్తేనే రాహుల్ గాంధీ నాయకత్వానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వస్తుంది, లేదంటే కేరళ గడ్డపై కాంగ్రెస్ జెండా మరింత పలచబడటం ఖాయం.

# ఏప్రిల్ 2తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీల కాలం

**విజయవాడ - సూర్య వాస్తవం**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో గ్రామ పాలనపై ఆసక్తికర పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ ఎలా ఉండబోతుందన్న దానిపై స్పష్టత కోసం ప్రజలు, స్థానిక నాయకులు ఎదురు చూస్తున్నారు. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. అభివృద్ధి కార్యక్రమాల అమలు, మౌలిక వసతుల కల్పన, కేంద్ర?రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం వంటి బాధ్యతలను ఈ ఐదేళ్లలో నిర్వర్తించారు. రహదారులు, తాగునీటి పథకాలు, పారిశుధ్య కార్యక్రమాలు, వీధి దీపాల ఏర్పాటు, చెత్త నిర్వహణ వంటి అంశాల్లో కొంతమేర అభివృద్ధి కనిపించినప్పటికీ, నిధుల కొరత, అధికార పరిమితులు, వివిధ శాఖల మధ్య సమన్వయం లోపం వంటి సమస్యలు కూడా ఎదురయ్యాయని పలువురు సర్పంచ్‌లు చెబుతున్నారు.పదవీకాలం ముగిసే సమయానికి గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రారంభమైన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొత్త ఎన్నికలు జరిగే వరకు పెద్దస్థాయి అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవచ్చని తెలుస్తోంది.సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీల పరిపాలన కొనసాగించడానికి ప్రభుత్వం తాత్కాలిక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు లేదా మండల స్థాయి అధికారులకు ప్రత్యేక అధికారాలు ఇచ్చి పరిపాలన కొనసాగించే విధానం అమలులో ఉంటుంది.

ఈసారి కూడా అలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. కొత్త ఎన్నికలపై స్థానికంగా చర్చలు మొదలయ్యాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే కొత్త అభ్యర్థుల పేర్లు వినిపిస్తున్నాయి. యువత, మహిళలు కూడా ఈసారి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో స్థానిక రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాధాన్యత, పార్టీ అనుబంధాలు వంటి అంశాలు కూడా రాబోయే ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.తమ పదవీకాలంలో గ్రామాభివృద్ధికి కృషి చేశామని చాలా మంది సర్పంచ్‌లు చెబుతున్నారు. అయితే నిధుల కొరత వల్ల అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయామని కొందరు పేర్కొంటున్నారు. కేంద్రం నుంచి వచ్చే పంచాయతీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు సమయానికి అందకపోవడం కూడా సమస్యగా మారిందని అంటున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు తమ వ్యక్తిగత నిధులతో కూడా అభివృద్ధి పనులు చేపట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు.సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశముంది.

పలు గ్రామాల్లో యువ నాయకులు, సామాజిక కార్యకర్తలు స్థానిక పాలనలోకి రావాలని ఆసక్తి చూపుతున్నారు. అదే సమయంలో ఇప్పటికే ఉన్న నాయకులు మళ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామాభివృద్ధికి కొత్త దిశ చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, పారదర్శక పాలన అందించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం వంటి అంశాల్లో కొత్త నాయకత్వం కీలక పాత్ర పోషించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏప్రిల్ 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండగా, గ్రామ పంచాయతీ పరిపాలనపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కీలకంగా మారింది. కొత్త ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చిన తర్వాత గ్రామాల్లో రాజకీయ చైతన్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఈ మార్పులు రాబోయే రోజుల్లో గ్రామ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## నీటి కోసం విలవిలలాడుతున్న హెచ్ సిద్ధాపురం గ్రామస్తులు

**- పండగపూట నీళ్లు రాకపోవడంతో స్పందించిన ఎంపీపీ**

**- ప్రజల దాహార్తిని తీర్చడానికి సొంత ఖర్చులతో నీళ్ల ట్యాంకులు సరఫరా...**





**రాయదుర్గం - సూర్య వాస్తవం :** నీటి కోసం విలవిలలాడుతున్న సిద్దాపురం గ్రామస్తుల సమస్యను పరిష్కరిం చేందుకు ఎంపీపీ భర్త బిజెపి నాయకులు వన్నూరు స్వామి తన సొంత నిధులతో నీళ్ల ట్యాంకర్లను హెచ్ సిద్రాపురం గ్రామా నికి ప్రజల దాహార్తిని తీర్చడానికి ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు నీరు అందే విధంగా కృషి చేశారు. పండుగ సమయంలో నీరు లేక ప్రజలు ఇబ్బందిని చూసి చెల్లించి పోయిన ఎంపీపీ పవిత్ర వన్నూరు స్వామి ట్యాంకర్లతో ప్రజల వద్దకే నీరు సరఫరా చేయడంతో ఎంపీపీ పవిత్ర వన్నూరు స్వామికి సిద్దాపురం గ్రామ ప్రజల కృతజ్ఞతలు తెలిపారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

**- రూరల్ సిఐ సీతారామిరెడ్డి**



**లింగాల - సూర్య వాస్తవం :** ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ ఆదేశాల సూచనల మేరకుపులివెందుల రూరల్ 'సీఐ సీతారామిరెడ్డి' శుక్రవారం లింగాల మండల పరిధిలోని పలుచోట్ల ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు, ఈ తనిఖీలో భాగంగా భారీ వాహనాలకు, ఇన్సూరెన్స్, మరియు ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్, వాటిని పరిశీలించి, వాహనాలకు సరైన పత్రములు లేని వాటికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా 'సిఐ సీతారామరెడ్డి' మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు అన్ని పత్రాలు కలిగి ఉండాలి, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను అరికట్టవచ్చునని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదలపై హర్షం

**- ఏపీ ప్రభుత్వానికి చైతన్య కుమార్ అభినందనలు**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై టిడిపి ప్రొఫెషనల్ వింగ్ మాజీ అధ్యక్షుడు కొండూరు చైతన్య కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మాట నిలబెట్టుకున్నారని ఆయన అన్నారు. జాబ్ క్యాలెండర్ వంటి పారదర్శక విధానం ద్వారా నిరుద్యోగ యువతకు స్పష్టత, నమ్మకం పెరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు యూపీఎస్సీ వంటి కేంద్ర స్థాయి సంస్థల్లో మాత్రమే ఉన్న ఈ విధానాన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడం మంచి ముందడుగని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా యువతకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల నిరుద్యోగ యువతకు నిజమైన ఉగాది కానుకగా నిలిచిందని అన్నారు.

### ముఖ్యమంత్రి గారూ! పాక్షిక జాబ్ క్యాలెండర్ సరే

# మరి నిరుద్యోగ భృతి మాటేమిటి?

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం ఉగాది పండుగ సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పట్ల తులసి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కానీ అదే సమయంలో నిరుద్యోగ భృతి మాటేమిటి? అని తులసి రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రక టించింది పూర్తి జాబ్ కాలండర్ కాదని, పాక్షిక జాబ్ క్యాలెండర్ మాత్రమే అని తులసి రెడ్డి గుర్తు చేశారు. 2026 మే నుంచి అక్టోబర్ లోపల వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 1 0,0 6 0 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని తులసి రెడ్డి గుర్తు చేశారు. మిగతా ఖాళీల మాటేమిటి? నిరుద్యోగ భృతి మాటేమిటి అని తులసి రెడ్డి ప్రశ్నించారు.రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని,వారికి ఉద్యోగం వచ్చినంత వరకు నెలకు 3000 రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి పార్టీలు తమ మేనిఫెస్టోలో పేర్కొన్నా యి. సూపర్ సిక్స్ హామీలలో హామీ ఇచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చి 21 నెలలు అయినప్పటికీ ఇంతవరకు నిరుద్యోగ భృతి కింద పైసా సాయం చేయలేదు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో, 2025 -26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు . 2026-27 బడ్జెట్లో కూడా ఈ పథకానికి పైసా కేటాయించలేదు. ఇచ్చిన మాట ప్రకారము ఖాళీగా ఉన్న మిగతా ప్రభుత్వ పోస్టులు భర్తీ చేయాలని, 2026 ఏప్రిల్ ఒకటి నుంచి నిరుద్యోగ భృతిని అమలు చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఎప్పుడు ఇస్తారు?**

కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యకు ఉరిత్రాడు వేస్తోందని తులసిరెడ్డి మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకం కింద అనగా విద్యాజీవన పథకం కింద ఒక్కొక్క క్వార్టర్ కు 700 కోట్ల రూపాయలు చొప్పున 9 క్వార్టర్ల కు కలిసి 6300 కోట్ల రూపాయలు ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తులసి రెడ్డి గుర్తు చేశారు.అదేవిధంగా స్కాలర్షిప్ పథకం కింద అనగా వసతి దీవెన పథకం కింద సంవత్సరానికి 1100 కోట్ల రూపాయలు చొప్పున రెండు సంవత్సరాలకు కలిసి 2200 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయి విద్యా జీవన,వసతి జీవన పథకాల కింద మొత్తము 8500 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయి. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, కరెంటు బిల్లులు కట్టలేక కళాశాల యాజమా న్యాలు ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఒరిజినల్ సర్టిఫికెట్లు అందని కారణంగా విద్యార్థులు పై చదువులకు పోలేక, ఉద్యోగ అన్వేషణకు పోలేక నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు . విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వర్ణనా తీతం.ప్రభుత్వం వెంటనే విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు 8500 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

**తెలుగుజాతి అంతరించిపోతూ ఉంటే నంబర్ వన్ చేస్తానని చెప్పడం విడ్డూరం**

శ్వాస ఆగిపోతే మనిషి చస్తాడు భాష ఆగిపోతే జాతి చస్తుంది.ప్రస్తుత పరిణామాలు చూస్తూ ఉంటే సమీప భవిష్యత్తులో తెలుగు భాష అంతరించిపోయే ప్రమాదం కనిపిస్తూ ఉంది.తెలుగు వద్దు- ఇంగ్లీష్ ముద్దు అమ్మ వద్దు- మమ్మీ ముద్దు,నాన్న వద్దు- డాడీ ముద్దు అనే సంస్కృతి ఆంధ్రప్రదేశ్లో శరవేగంగా విస్తరిస్తూ ఉంది. ఇంగ్లీషులో మాట్లాడడం గొప్పతనంగా, తెలుగులో మాట్లా డటం నామోషీగా భావించే పరిస్థితి ఉంది. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ ఆస్థానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ జగన్ ప్రభుత్వం గతంలో జీవో 85 జారీ చేసింది. అదే జీవో చంద్రబాబు ప్రభుత్వంలో కూడా కొనసాగుతూ ఉంది. పర్యవసానంగా ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాసే వారే కరువయ్యారు. దాదాపు 95 శాతం మంది ఆంగ్ల మధ్యంలో రాస్తున్నారు. మిగతావారు ఉర్దూ, కన్నడ తమిళ్ ఒరియా,సంస్కృత భాషల్లో రాస్తున్నారు.కానీ తెలుగు మాధ్యమంలో రాసే వారే లేరు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్లో ఈ దుస్థితి రావడం శోచనీయం.తెలుగు భాష కోసం, తెలుగు జాతి కోసం స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించగా అటువంటి టీడీపీ పాలనలో తెలుగు భాష, తెలుగు జాతి అంతరించిపోయే దుస్థితి రావడం దురదృష్ట కరం. 2047 నాటికి తెలుగుజాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి తెస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం ఉత్తర కుమార ప్రగల్బాలు మాత్రమే. నిజంగా తెలుగు జాతి పట్ల,తెలుగు భాషా పట్ల చంద్రబాబుకు ప్రేమ ఉంటే,ఎన్టీఆర్ పట్ల,పొట్టి శ్రీరాములు పట్ల గౌరవం ఉంటే జగన్ ప్రభుత్వం జారీచేసిన జీవో 85ను వెంటనే రద్దు చేయాలని,ప్రాథమిక విద్యలో అటు ప్రైవేట్ పాఠశాలల్లో ఇటు ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని, తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ఉన్నత విద్యా ప్రవేశాలలో ఉద్యోగాలలో రెండు శాతం అదనపు మార్కులు కలపాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నాటి హామీ నేడు అమలు


**- యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్**

**- కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు**



**శాంతిపురం - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ గతంలో తన యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి మాజీ సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి,మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు, గౌని వారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉగాది పర్వదినాన అద్భుతమైన కానుకను అందించారన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 10,060 పోస్టులతో కూడిన భారీ 'జాబ్ క్యాలెండర్'ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ క్యాలెండర్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పక్కా ప్రణాళికతో భర్తీ చేయనున్నారన్నారు. మే 15న ఉన్నత విద్యాశాఖలో 1,500 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుండగా, ఆగస్టు 15న 91 గ్రూప్-1 పోస్టులకు మరియు హోం శాఖలో 2,778 పోస్టులకు నోటిఫికేషన్లు రానున్నాయన్నారు. విశ్వవిద్యాల యాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి కూడా ప్రత్యేక ప్రకటన చేయడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయనున్నారన్నారు.ఈ నియామక ప్రక్రియ సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మరింత వేగవంతం కానుందన్నారు. సెప్టెంబర్ 15న 750 గ్రూప్-2 పోస్టులు, 503 ఏఈఈ పోస్టులతో పాటు మరో 506 ఇతర విభాగాల పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నార న్నారు. అక్టోబర్ 15న పాఠశాల మరియు ఇంటర్ విద్యకు సంబంధించి 3,004 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. మాట ఇచ్చాం, అమలు చేశాం అనే నినాదంతో, కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల కలలను నిజం చేస్తూ భవిష్యత్తుకు బలమైన పునాది వేసిందన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా వేల పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఈ జాబ్ క్యాలెండర్ ద్వారా యువతకు ఉపాధి విప్లవాన్ని పరిచయం చేస్తోందన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పట్ల రాష్ట్రంలోని నిరుద్యోగుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు యువ మంత్రి నారా లోకేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గండి ఆలయ ఉపప్రధాన అర్చకులు రాజా స్వామికి ఉగాది పురస్కారం



**వేంపల్లె - సూర్య వాస్తవం :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కారాలలో భాగంగా గండిక్షేత్రం లోని ఆంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామికి ఉగాది పురస్కారం లభించడం గర్వకారణమని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ మరియు గండి ఆలయ మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గండిక్షేత్రంలో రాజా స్వామి ని వారు శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజా స్వామి ఆలయ అభివృద్ధి, భక్తులకు అందిస్తున్న సేవలు విశేష మని వారు కొనియాడారు. ఎంతో అంకితభావంతో, భక్తి శ్రద్ధలతో ఆలయ సేవలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తున్నారని అన్నారు. ఆయన చేసిన సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఇలాంటి పురస్కారాలు మరింత సేవా తపనను పెంపొందిస్తాయని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవలు కొన సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొని రాజా స్వామికి అభినందనలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరికి విశేష పూజలు



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించు కుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలం కారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషాలకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వ హించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర, పౌర్ణమి, అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యం, కుంకుమార్చన,బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాకారోత్సవం 4 జ్యోతులతో మంగళవాయిద్యాలతో అంగరంగ వైభవంగా జరిగింది అని తెలిపారు.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసినటువంటి తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తదులందరూ పాల్గొన్నారు.

# జీఎస్టీ బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- వాణిజ్య కార్యకలాపాల పెరుగుదల నేపథ్యంలో పన్నుల వసూళ్లు పక్కాగా జరగాలి
- ఆదాయాన్ని అందించే శాఖలు రాష్ట్ర జీఎస్టీ శాఖతో సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ అందించే శాఖలు రెవిన్యూ ఆదాయ లక్ష్యాలను అధిగమించా లని, వాణిజ్య కార్యకలాపాలు, వస్తువుల, సేవల వినియోగంపై జిఎస్టి వసూళ్లు పక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని అందించే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు,రవాణా శాఖ, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ శాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖ లకు ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ కలెక్టర్ కె ఆర్ ఆర్ సి చంద్రశేఖర్ రెడ్డి తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రస్తుతం పంచాయతీ పరిధిలో వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో, గృహ పన్నుల కంటే వాణిజ్య సంస్థల నుంచి సరైన పన్నుల వసూళ్లు జరగడం అత్యంత అవసరమని సూచించారు. ముఖ్యంగా మున్సిపాలిటీ, పంచాయితీ పరిధి వెలుపల ఉన్న పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మరియు ఇతర వాణిజ్య సంస్థలపై దృష్టి సారించి,తగిన విధంగా ప్రొపోర్షనల్ టాక్స్ వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పన్ను వసూళ్లలో ఏవైనా లోపాలను ఉన్నట్లు గుర్తిస్తే వాటిని వెంటనే సరిచేసే చర్యలు చేపట్టాలన్నారు. జిఎస్టి నంబర్ల ఆధారంగా వ్యాపార లావాదేవీలను పరిశీలించి, నాన్-జెన్యూన్ రిటర్న్ ఫైలర్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాలకు సంబంధించి ప్రత్యేక మానిటరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకొని రోజువారీ పురోగతిని సమీక్షించాలన్నారు. అన్ని శాఖల నుంచి ప్రతి వారం బిల్లుల ప్రాసెసింగ్‌కు సంబంధించిన సమాచారం సేకరించి, కమర్షియల్ టాక్స్ శాఖతో పంచుకోవాలని, సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, సమాచార మార్పిడిని బలోపేతం చేయాలని ఏ శాఖ నుంచి సహకారం లోపించినా, వెంటనే మానిటరింగ్ విభాగానికి తెలియజేసి లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యాచరణ అంశాలపై అన్ని శాఖలు సమగ్ర నివేదికను సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థతను పెంపొందించడంతో పాటు ఆదాయ వృద్ధి సాధించడం లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మైన్స్ తదితర ఆదాయ వనరుల శాఖలు తమ లావాదేవీలను క్రమబద్ధంగా నమోదు చేసి పన్ను చెల్లింపులను నిర్ధారించి ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. జీఎస్టీ వసూళ్ల పై పెండింగ్ లో బకాయిలు, కేసుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖలు, కాంట్రాక్టర్లు నుండి రావలసిన వసూళ్లకు సంబంధించిన వివరాలను వివిధ శాఖల అధికారులు జీఎస్టీ శాఖ అధికారులకు అందజేసి సమన్వయంతో కలిసి పనిచేసి జీఎస్టీ వసూళ్ల పై పెండింగ్ జీఎస్టీ బకాయాలను సమీక్షించుకొని వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ పై అవగాహన పెంచి ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటూ రెవెన్యూ ఆదాయ శాఖల్లో వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ , జీఎస్టీ , డిపిఓ, బిఎస్డబ్ల్యుఓ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, మైనింగ్, అటవీ శాఖ, మదనపల్లి, పుంగనూరు, బి.కొత్తకోట మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలను నిలువరించడంలో
# కూటమి ప్రభుత్వ వైఖరేంటి.?

- డ్రగ్స్‌ను నిలువరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- డ్రగ్స్‌తో యువత జీవితాలు సర్వనాశనం
- డ్రగ్స్ కేసులో పట్టుబడిన టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి
- క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు చేపట్టాలి
-అఖిల భారత యువజన సమాఖ్య, అనంతపురం జిల్లా సమితి




**రాయదుర్గం– సూర్య వాస్తవం:** డ్రగ్స్ కేసులో పట్టుబడిన తెలుగుదేశం పార్టీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పై కూటమి పార్టీ వైఖరీ ఏంటి తక్షణమే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య అనంత పురం జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ విషయంపై రాయదుర్గం పట్టణం ఏపీఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎాౖఖీ అనంతపురం జిల్లా అధ్యక్షులు కావలి కోట్రేష్ మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన ఎంపీపై తెలుగుదేశం పార్టీ నాయకత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.డ్రగ్స్ కేసులో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పట్టుబడిన ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిందని వారు పేర్కొన్నారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పట్టుబడటం అత్యంత దురదృష్టకరమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తెలిపారు. యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉండాలని తరచూ ఉపన్యా సాలు చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఇప్పుడు తమ పార్టీ ప్రజాప్రతినిధులే డ్రగ్స్ కేసుల్లో చిక్కుకోవడంతో ప్రజలకు ఏమి సమాధానం చెబు తారని ప్రశ్నించారు. ఈ ఘటనపై పూర్తి నైతిక బాధ్యత వారే వహించాలని అన్నారు.డ్రగ్స్ వినియోగం సమాజాన్ని నాశనం చేసే తీవ్రమైన సమస్యగా మారుతోందని, యువత భవిష్యత్తును దెబ్బతీసే ఈ ప్రమాదకరమైన పరిస్థితిని అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇలాంటి కేసుల్లో పట్టుబడిన ప్రజా ప్రతినిధులకు ఎలాంటి రాజకీయ పరిరక్షణ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎాౖఖీ అనంతపురం జిల్లా సమితి స్పష్టం చేసింది. విలువలు, నైతికత గురించి మాట్లాడే తెలుగుదేశం పార్టీ నాయకులు ముందుగా తమ పార్టీ నాయకులపైనా అదే ప్రమాణాలను అమలు చేయాలని వారు సూచించారు. ఈ కేసుపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజనిజాలను ప్రజలకు వెల్లడించాలని ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని కొనసాగిస్తుందని, యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచేందుకు ప్రజల్లో చైతన్యం పెంచే కార్యక్రమాలను మరింత విస్తృతం గా చేపడతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్ కోశాధికారి నాగయ్య నాయకులు గంగాధర్ అశోక్ దినకర్ తదితరులు పాల్గొన్నారు..

# రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

- ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు
- జనసేన పార్టీ నేత డా. దాసరి రవిశంకర్



**వేంపల్లె – సూర్య వాస్తవం :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు పులివెందుల నియో జకవర్గ జనసేన పార్టీ నేత డా. దాసరి రవిశంకర్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, రంజాన్ మాసం ఆధ్యాత్మిక చింతనకు, ఆత్మపరిశీలనకు, సహనానికి పరస్పర సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొ న్నారు. ఈ పవిత్ర నెలలో ఆచరించే ఉపవాసాలు మను షుల్లో నియంత్రణ, నియమం, దయ, దాక్షిణ్య భా వాలను పెంపొందిస్తాయని తెలిపారు. సమాజంలో శాంతి, సామ రస్య వాతావరణం నెలకొనాలని, ప్రతి కుటుంబం సుఖ శాంతులతో రంజాన్ వేడుకలను జరుపుకోవాలని ఆకాం క్షించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సమగ్ర అభివృద్ధికి మత సామరస్యమే ప్రధాన బలమని అభిప్రాయ పడ్డారు. రంజాన్ మాసం సేవా భావం, పంచుకునే సంస్కృతి, మానవతా విలువలను గుర్తు చేస్తుందని పేర్కొంటూ, ఈ పవిత్ర సమయంలో అల్లాహ్ కృపా కటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని, రాష్ట్రంలో శాంతి--సౌభ్రాతృత్వాలు మరింత బలపడాలని దాసరి రవిశంకర్ ఆకాంక్షించారు.



# దోమల నిర్మూలనకు నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ విడుదల

### - సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య

**పులివెందుల– సూర్య వాస్తవం :** ఫ్రైడే- డ్రైడే సందర్భంగా పులివెందుల పట్టణం లోని గోపివిహార వీధిలో నిల్వ నీటిలో మరియు బాకరాపురం లోని నిల్వ నీటిలో దోమల ఉధృతిని తగ్గించడానికి, సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా బారి నుండి ప్రజలను రక్షించడానికి ‘ఆయిల్ బాల్స్’ విడుదల చేయడమైనది. ఈ కార్య క్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ లార్వాల దశలోనే అంతం :దోమలు నిలిచిన మురుగు నీటిలో గుడ్లు పెట్టి లార్వాలుగా మారుతాయి. ఆయిల్ బాల్స్‌ను ఈ నీటిలో వేయడం ద్వారా, నూనె నీటిపై ఒక పలచని పొరలా ఏర్పడు తుంది. దీనివల్ల లార్వాలకు గాలి అందక అవి అక్కడికక్కడే చనిపోతాయి. తక్కువ ఖర్చు – ఎక్కువ ఫలితం: ఖరీదైన రసాయన స్ప్రేల కంటే ఆయిల్ బాల్స్ తయారీ చాలా సులభం మరియు తక్కువ ఖర్చుతో కూడుకున్నది. పాత ఇంజిన్ ఆయిల్ లేదా ఎం.ఎల్.ఓ ఆయిల్ ఉపయోగించి వీటిని తయారు చేయవచ్చు. ప్రభావవంతమైన పనితీరు: ఒక్కసారి వేసిన ఆయిల్ బాల్ సుమారు 7 నుండి 10 రోజుల పాటు నీటి పై నూనె పొరను నిలిపి ఉంచి, దోమల ఉత్పత్తిని సమర్థవంతంగా అడ్డుకుంటుంది. **ప్రజలకు విజ్ఞప్తి:** మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకులు, నిర్మాణం నిలిచిపోయిన భవనాల వద్ద నీరు నిల్వ ఉన్న చోట ఈ ఆయిల్ బాల్స్ వాడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత. దోమల నివా రణకు ప్రతి ఒక్కరూ సహకరించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని సిద్దయ్య అన్నారు. ఈ కార్యక్రమములో ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, శేష గిరి నాయక్, చిన్నమ్మ, సంపూర్ణమ్మ ఆశా కార్యకర్త లక్ష్మిదేవి పాల్గొన్నారు.

# ఉగాది విందులో టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. శుక్రవారం మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మల్లంగి సుధాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్య క్రమంలో పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, మండల ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి కన్వీనర్ రామ మునిరెడ్డి, మాచిరెడ్డి శివసాగర్ రెడ్డి, వేమకుమార్, మహమ్మద్, రాజా నాయక్, గండికోట శివ తదితరులు విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి వాఖ్యలు సిగ్గుచేటు

- పిల్లలకు క్షమాపణలు చెప్పాలి
- “గర్వమున కళ్ళు గానక తిరుగువాడు గోతిలో పడుట తథ్యము”




**రాయదుర్గం– సూర్య వాస్తవం:** గరికపాటి నరసింహారావు పేద పిల్లలకు అందించే మధ్యాహ్నభోజన పథకంపై అహంకారపు అక్కసు వెళ్ళగక్కడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. వాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తుంది. ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయం. పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు “మిధ్య” అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. మధ్యాహ్న భోజనం పిల్లలు బడికి వచ్చేందుకు, డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. విద్యార్థులను “శోభనం పెళ్లికొడుకు”తో పోల్చడం విద్యార్థి లోకాన్ని కించపరచడం. భారతదేశంలో 84% మంది తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోడిగుడ్డును దానిని “గాడిద గుడ్డు” అని సంబోధించడం ఆకలిని కించపరచడం. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత. దానిని “బిచ్చం” అని పిలవడం సిగ్గుచేటు. గరికపాటి వ్యాఖ్యలు కనీస “విజ్ఞత లేనివి”. ఏనాడయిన కార్పో రేట్లకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీల గురించి మాట్లాడని గరికపాటు పేద పిల్లలకు అందించే భోజనంపై విషం కక్కటం దుర్మార్గం. గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. పిల్లలను అవమానించిన గిరికపాటి నరసింహారవు క్షమాపణలు చెప్పాలి.

# అవినాష్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత బీటెక్ రవికి లేదు

- సర్వశక్తులు ప్రయోగించినా ఎంపీ అవినాష్ రెడ్డి విజయాన్ని అడ్డుకోలేకపోయారు
- ప్రజా సంక్షేమం చేతకాక పరనిందలకే కూటమి సభ్యుల ప్రాధాన్యం



**పులివెందుల - సూర్య వాస్తవం:** సర్వ శక్తులు ధారపోసినా కూటమి సభ్యులు సార్వత్రిక ఎన్నికలలో ఎంపీ అవినాష్ రెడ్డి విజయాన్ని అడ్డుకోలేక పోయారని, జిల్లా అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తున్న ఎంపీ అవినాష్ రెడ్డిని విమర్శించే అర్హత బీటెక్ రవికి లేదని, ప్రజా సంక్షేమం వదిలేసి పరనిందలకే కూటమి సభ్యులు ప్రాధాన్యతనిస్తున్నారని బీటెక్ రవి తీరుపై పులి వెందుల వైకాపా నాయకులు మండిపడ్డారు.

శుక్రవారం పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సి పల్ ఛైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప ఇతర వైకాపా నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వివేకా హత్య కేసు లేకుంటే బీటెక్ రవికి మునుగడ లేదని అందుకే సునీత వెనుకాలే తిరుగుతూ, అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటూ పబ్బం గడుపుకుంటు న్నారని, ఏ సెక్షన్ ఎవ్వరికీ పెట్టాలో ఎవ్వరికి ఏ శిక్ష వేయాలో చెప్పడానికి బీటెక్ రవి మరియు సునీతమ్మలే జడ్జి లుగా వ్యవహరించితే సుప్రీమ్ కోర్ట్ మరియు సీబీఐ ఎందుకని, నెలకు ఒకసారి పులివెందుల రావడం, వివేకా హత్య కేసు గురించి మాట్లాడటం మళ్ళీ అదృశ్యం అవ్వడం తప్ప ఈ రెండేళ్లలో ప్రజలకు చేసింది శూన్యమని, ఏ అర్హత ఉందని బీటెక్ రవి సిద్ధం అని అంటున్నాడు అర్థం కావడం లేదని ఊర్లో పెళ్లికి ఎవరో హడావుడి అన్నట్లు నీ గోల ఏంటో ఎవ్వరికీ అర్థం అవ్వడం లేదని, ప్రపంచం లోనే ఇదొక వింత, చంపినోడికి ఒకడే లాయర్, సునీతమ్మ కి ఒక్కడే లాయర్, ఆదుకుంటున్న చంద్రబాబుకు ఒక్కడే లాయర్, ఇంత వింత గురించి మాట్లాడే నీకు అవార్డులు ఇవ్వాలని, సావిత్రిని కాక బీటెక్ రవిని పెట్టి మహానటి సినిమా తీసుంటే కచ్చితంగా ఆస్కార్ కంటే పెద్ద అవార్డు వచ్చి ఉండేదని, జిల్లాలో అవినాష్ రెడ్డి క్రేజ్ ముందు నీ కుప్పిగంతులు బలాదూర్, ఎన్ని చారలు పెట్టుకున్న పిల్లి పులి అవ్వదు, అలాగే అవినాష్ రెడ్డి కి మీరు సరితూగరు, అవినాష్ రెడ్డి ఏ తప్పు చేయలేదు, ధర్మం ఉంది కాబట్టే అటు రాష్ట్రంలో ఇటు కేంద్రంలో కీలకంగా ఉన్న చంద్రబాబు, సిద్ధార్థ లూథ్ర, సీబీఐ అంతా ఏకమైన సుప్రీమ్ కోర్ట్ లో అన్ని పిటిషన్ లు వీగిపోయాయి, న్యాయం గెలిచింది, గెలిచి తీరుతుందని, నీచ రాజకీయాల కోసం నీలాంటి వారంతా వైఎస్ కుటింబీకుల పంచన చేరి షర్మిలమ్మ, సునీతమ్మ, చంద్రబాబు, నువ్వు, ఆదినారాయణ రెడ్డి వాసు అంతమంది కలిసి అవినాష్ రెడ్డి పై బురద చల్లినా, ఈవీఎం టాంపర్ చేసిన ఎంపీ గెలుపును అడ్డు కోలేకపోయారని ఇకనైనా పరిణిందలు మాని ప్రజా సంక్షేమానికి పాటుపడాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ హాఫీజ్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, వైసీపీ రాష్ట్ర నాయకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# పండుగను భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలి

- అనంతపురం జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రి




**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ప్రజలకు, ముస్లిం సోదర, సోదరీమణులకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలకు రంజాన్ పండుగ అతి పవిత్రమైన పండుగ అని ముస్లిం సోదర సోదరీ మణులు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు పచ్చి మంచినీరు కూడా ముట్టకుండా నెల రోజులు నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు పాటించిన వారికి దేవుడు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలుగజేయాలని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో పండుగను భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకొని అల్లాహ్ కృపకు పాత్రులు కాగలరని భగవంతుడిని కోరుతున్నానని అయన ఆకాంక్షించారు.

# వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలి

- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు
- సీఐ టి.నరసింహులు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ టి.నరసింహులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. అనంతరం సీఐ టి.నరసింహులు మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. వాహనాల రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకర మన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, వాహన పత్రాలు, తమ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ పై పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. దుకాణదారులు తమ బోర్డులను దుకాణ పరిధిలో ఉంచుకోవాలని తెలిపారు. దుకాణదారులు రోడ్ల పై బోర్డు లను పెడితే ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. వాహన దారులు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ టి.నరసింహులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కిరణ్, శ్రీనాధ్ రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

# కటారుపల్లి మదీనా మస్జిద్‌కు ఫ్యాన్లు, విద్యుత్ పరికరాలు వితరణ



**గాండ్లపెంట - సూర్య వాస్తవం :** గాండ్లపెంట మండలంలోని కఠారుపల్లీ గ్రామానికి చెందిన మదీనా మస్జిద్‌కు తక్షణ అవసరాల నిమిత్తం ఫ్యాన్లు, విద్యుత్ పరికరాల కొనుగోలుకు, కదిరి కి చెందిన సిమ్స్ హాస్పిటల్ ఎండి నిసార్ యాసిన్ ఖాన్ రూ. 15వేలు అందజేశారు. ఇంకా ఏమైనా మస్జిద్ అవసరాలకు కచ్చితంగా తన వంతు సాయం చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా గాండ్లపెంట మండల పరిధిలో భవిష్యత్తులో బీద అమ్మాయిలు వివాహాల కోసం తన వంతు సహాయం అందిస్తామని ఈ సందర్భంగా మత పెద్దలకు తెలియజేశారు. తమ హాస్పిటల్ నందు బీద వారికి వైద్య సేవలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాహిర్ వలి, వసిం యాసిన్, ముతవల్లి ఫక్రుద్దీన్, ఇర్ఫాన్, హైదర్ వలీ, ఆలం వలి, హబీబ్ ఉల్లాహ్, జిలాన్, మహబూబ్ బాషా, రియాజ్, నజీర్, బాబాసాహెబ్ సీమా హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


# మాంసం ప్రియులను దొచుకొంటున్న కటిక వ్యాపారస్తులు

- అధికారులు దాడులు చేయాలంటున్న మాంసం ప్రియులు



**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఉగాది, రంజాన్ పండుగలను దృష్టిలో పెట్టుకొని కటిక వ్యాపా రస్తులు మాంసం ప్రియులను దొచుకొంటున్నారు. ఇష్టానుసారంగా కటిక వ్యాపారస్తులు ధరలను నిర్ణయించి విక్రయాలు సాగిస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఎక్కడ లేని మాంసం ధరలు వేంపల్లెలో ఉన్నాయి. వేంపల్లెలోని జడ్పీ కాంప్లెక్స్ వెనుక వైపు, బ్యాంకు సర్కిల్, మైయిన్ బజార్, గండి రోడ్డులో ప్రాంతాల్లో ఉన్న కటిక వ్యాపారస్తులు కేజి రూ 900 లను విక్రయిస్తుండగా అర్ధకేజీ వీధి వద్ద కేజీ రూ 850 విక్రయిస్తున్నారు. మామూలుగా అయితే కేజీ రూ 700 నుండి 750 కు ఉండాల్సి ఉంది. పండుగలను అదునుగా చేసుకొని ఇష్టాసారంగా ధరలు పెంచి మాంసం విక్రయాలు చేస్తున్నారు. పేదలు మాంసం వద్దకు వెళ్లాలంటే భయపడుతున్నారు. చికెన్ దుకాణాదారులు కూడ సిండికేట్ అయ్యి కేజీ 300 పెట్టి విక్రయాలు చేస్తున్ననారు. పండుగ పూట మాంసం తినాలంటే ధరలను చూసి తినలేక పోతున్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు ఒక్కరూ కూడ మాంసం విక్రయాలు ధరలపై పట్టించుకోక పోవడంతో కటిక వ్యాపారస్తులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పండుగ పూట మాంసం ప్రియులకు మాంసం అదే విధంగా ధరలు పెట్టిందేకు అధికారులు కటిక దుకాణాలపై దాడులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ అధికారి నాగభూషణం రెడ్డి కూడ కటిక దుకాణాలపై దాడులు చేసి ధరలను అదుపులోకి తీసుకొని రావాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

# రంజాన్ పండుగకు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు



**పులివెందుల - సూర్య వాస్తవం :** నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు నేడు ఈద్ ఉల్ ఫితర్‌ను జరుపుకోనున్నారు. పులివెందుల పట్టణంలో కోతి సమాధి వద్ద, శ్రీరామ్ థియేటర్ వద్ద, పడగొట్టిన ఆర్టీసీ బస్టాండ్ సమీపం లో ఉన్న ఈద్గాలు, మజీదులను విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. ఏ నెలవంకను చూసి పవిత్ర ఉపవాసాలను ప్రారంభిస్తారో అదే నెలవంకను నెలరోజుల తర్వాత చూసి ఈద్ ఉల్ ఫితర్ జరుపుకుంటారు. పండుగ రోజు ఫజర్ నమాజ్ చేయడంతో పాటు నూతన వస్త్రాలను ధరిస్తారు. అనంతరం ఈద్ గాహ్‌లకు బయలుదేరి నమాజు పూర్తి చేసుకున్న అనంతరం ఒకరినొకరు అలాయ్ బలాయ్ ఇచ్చుకుని శు భాకాంక్షలు చెప్పుకుంటారు. ప్రతీఒక్కరూ ఈద్ నమాజ్‌ను భక్తిశ్రద్ధలతో చదవాలని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు.

# బాలుడుని ఢీకొట్టిన స్కార్పియో


- ఆసుపత్రికి తరలించిన స్థానికులు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** ఉరవకొండ పట్టణ శివారులోని చెరువు కట్ట వద్ద సాయంత్రం సైకిల్‌పై వెళ్తున్న బాలుడు సాయి నివేద్‌ని స్కార్పియో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలవడంతో స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురానికి తీసికెళ్ళమని వైద్యులు చెప్పారు. స్కార్పియో యజమాని ఆసుపత్రికి వచ్చి, ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శాంతి, సహనం, సేవాస్ఫూర్తికి ప్రతీక రంజాన్ పండుగ

- జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** పవిత్ర రంజాన్ మాసం ముస్లింల జీవితంలో అపార మైన శాంతిని, ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్ని తీసుకురావాలని కడప జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీ మణులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సింగారెడ్డి జయ రామి రెడ్డి మాట్లాడుతూ రంజాన్ అంటే కేవలం ఉపవాసం మాత్రమే కాదు, క్రమశిక్షణ,దయ మరియు తోటివారికి సహాయం చేసే గొప్ప సమయం .ఈ నెలలో చేసే ప్రార్థనలు, సత్కార్యాలు అన్నీ ఫలించాలని, సహనం ఆకలిని, కోపాన్ని జయించే శక్తిని ఇస్తుందని, దానం (జకాత్) ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని గుర్తుచేస్తుందని, మనసుకి ప్రశాంతతను, దైవ చింతనను చేకూరుతుందని అన్నారు. జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# ముస్లిం మైనార్టీ సోదర సోదరీ మణులకు రంజాన్ శుభాకాంక్షలు



**రాయచోటి-సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా ముస్లిం సోదర సోదరీ మణులకు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు వతన్ సార్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులు ఈ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులతో కలిసి అనందంగా జరుపు కోవాలని మనస్ఫూర్తిగా ఆయన ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో ముస్లీం సోదరులు చేసిన కఠిన ఉపవాస దీక్షలను ఈద్-ఉల్-ఫితర్ పండుగతో ముగిస్తారని అన్నారు. ఈ రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలందరూ సోదర భావాన్ని కలిగియుండి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని వతన్ నిసర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫారుక్ లకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# త్వరలో ఉచిత విద్య ప్రాజెక్టు చేపడతా

**- చిరంజీవి**



'రక్తం ప్రాముఖ్యతను, రక్త కొరత కారణంగా ఎన్ని ప్రాణాలు పోతున్నాయో నేను అర్థం చేసుకున్నప్పుడు నా అభిమాను లందరినీ రక్తదానంలో పాల్గొనేలా స్ఫూర్తిని ఇవ్వాల్సిన అవసరం ఉందని నాకు అనిపించింది. ఆ ఆలోచన నాకు 25 ఏళ్ల క్రితమే కలిగింది. అయితే నేను కేవలం అక్కడితోనే ఆగిపోదలచుకోలేదు. భవిష్యత్తు లో పేద ప్రజలకు విద్యను ఎలా అందిం చాలనే దానిపై ఇప్పుడు ఆలోచి స్తున్నాను. నన్ను స్ఫూర్తిగా తీసుకుని నటుడు సూర్య 'అగరం ఫౌండేషన్'ను ప్రారంభించారు. ఇప్పుడు, నేను ఆయన నుంచి స్ఫూర్తి పొంది ఉచిత విద్యా బోధనను ప్రారంభించాలనుకుంటున్నాను. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఎక్కడైతే అవసరం ఉంటుందో, అక్కడ ఉచిత విద్యను అందించే దిశగా కృషి చేస్తా.త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తా' అని కథానాయకుడు చిరంజీవి తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఉచిత విద్యా ప్రాజెక్టు గురించి ప్రకటించారు.

# 'ఈగో రాజా'గా ఆది సాయికుమార్



ఆది సాయి కుమార్ కథానాయకుడిగా ఎస్‌జివిఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జి.సురేష్ నిర్మిస్తున్న చిత్రం 'ఈగో రాజా'. ఈ మూవీని గురు శరవణన్ తెరకెక్కిస్తున్నారు. తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఆది సాయి కుమార్ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టరును ఉగాది పండుగ సందర్భంగా నిర్మాతలు విడుదల చేశారు. చుట్టూ రౌడీలు, ఒంటిపై గాయాలు, రక్తం మరకలు వంటివి కనిపిస్తున్నాయి. హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లతోపాటుగా ఎమోషన్, మాస్ అప్పీల్‌తో ఈ సినిమా తెరకెక్కబోతోందని నిర్మాతలు ప్రకటించారు. కెఎస్ రవికుమార్ వద్ద పనిచేసిన దర్శకుడు గురు శరవణన్ 'కూగల్ కుట్టప్ప'తో మంచి విజయాన్ని అందుకున్నారు. 'ఈగో రాజా' శరవణన్‌కు మూడో సినిమా. 'శంబాల' తర్వాత ఆది సాయి కుమార్ ఈ చిత్రంతో తమిళ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. 'కంజూరింగ్ కన్నప్పన్', 'సట్టం ఎన్ కైయిల్' ఫేమ్ సతీష్ కూడా ఓ పాత్రను పోషిస్తున్నారు.



# సాయి పల్లవిని మణి సర్ ఎలా చూపించబోతున్నారో?

మణిరత్నం..భారతీయ దర్శకుల్లో ఓ లెజెండ్. తనదైన పంథాలో సినిమాలని తెరకెక్కించడంలో అయిన శైలి ప్రత్యేకం. ప్రేమకథా చిత్రాలకు సమకాలీన అంశాలని జోడించి వెండితెరపై అందమైన దృశ్యకావ్యాలుగా ఆవిష్కరించడంలో మణిరత్నం మాస్టర్ అన్నది తెలిసిందే. రోజా నుంచి -ఓకే బంగారం- వరకు ఈ విషయాన్ని నిరూపించాయి. మళ్లీ ఇన్నేళ్ల తరువాత మణిరత్నం రొమాంటిక్ లవ్‌స్టోరీతో సినిమా చేయడానికి రెడీ అవుతున్నారు. దీనికి సంబంధించిన వార్తలు గత కొన్ని రోజులుగా వినిపిస్తున్నాయి. అయితే సినీ లవర్స్, మణిరత్నం అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని తాజాగా అఫీషియల్‌గా ప్రకటించారు. భారీ స్థాయిలో తెరపైకి రానున్న ఈ మూవీని కోలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థగా పేరు తెచ్చుకున్న లైకా ప్రొడక్షన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మంగా తెరపైకి తీసుకురాబోతోంది. మద్రాస్ టాకీస్ సహ భాగస్వామిగా వ్యహరిస్తోంది. ఈ బ్యానర్ కిది 23వ సినిమా. విలక్షణ నటనకు పెట్టింది పేరు విజయ్ సేతుపతి. ఇందులో కథానాయకుడిగా నటిస్తున్నారు. మణిరత్నంతో ఆయనకిది రెండవ సినిమా. ఇంతకు ముందు -చెక్క చివంత వానం-లో నటించారు.ఈ మూవీ తరువాత మళ్లీ వీరిద్దరు కలిసి చేస్తున్న సినిమా ఇది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కథానాయికగా సాయి పల్లవి నటిస్తోంది. -రామాయణ-తో పాటు పలు భారీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ బిజీగా ఉన్న సాయి పల్లవికి మణిరత్నంతో ఇది మొదటి సినిమా కావడం గమనార్హం. ఏ. ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

కొన్ని రోజులుగా రెహమాన్ స్థానంలో యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ని మ్యూజిక్ డైరెక్టర్‌గా తీసుకుంటారని ప్రచారం జరిగింది. అయితే ఆ పుకార్లకు చెక్ పెడుతూ టీమ్ రెహమాన్ ఈ మూవీకి మ్యూజిక్ చేస్తారంటూ క్లారిటీ ఇచ్చేసింది.మణిరత్నం మార్కు రొమాంటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూలై నుంచి ప్రారంభిం అయ్యే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతే కాకుండా వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ ఉన్న సాయి పల్లవి ..మణిరత్నం ప్రాజెక్ట్‌కు డేట్స్ కేయించిందంటే సర్‌ప్రైజింగ్ ఎలామెంట్ ఏదో ఉంటుందని కూడా అందరూ చర్చించుకుంటున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి డిటైల్స్‌ని లైకా ప్రొడక్షన్స్ వర్గాలు వెల్లడించే అవకాశం ఉంది.





# ముంబయి మళ్లీ మెరిసేనా...?

## - ఐదుసార్లు ఛాంపియన్
## - 28నుంచి ఐపిఎల్ సీజన్-19 ప్రారంభం

**ముంబయి:** ఐపిఎల్‌లో ముంబయి ఇండియన్స్ అత్యంత బలమైన జట్టు. తొలి లీగ్ మ్యాచుల్లో నిరాశపరుస్తూ.. కీలక మ్యాచుల్లో చెలరేగి ఆడి ప్లే-ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. అనుభవజ్ఞులైన మ్యాచ్ విన్నర్లతో పాటు సమతుల్యమైన బ్యాటింగ్, బౌలింగ్ కాంబినేషన్‌తో ఆ జట్టును ఓడించాలంటే ప్రత్యర్థి జట్టుకు కత్తిమీద సామే. గత సీజన్‌లో ప్లే-ఆఫ్స్‌కు చేరి ఫైనల్‌కు చేరడంలో విఫలమై.. 3వ స్థానానికే పరిమితమైన ముంబయి.. ఈసారి ట్రోఫీ కొట్టాలన్న దృఢనిశ్చయంతో బరిలోకి దిగుతోంది. ముంబయి ఇండియన్స్‌కు ప్రధాన బలం వారి స్టార్ ఆటగాళ్లు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మ, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. వీరు ఒత్తిడిలో కూడా మ్యాచ్‌ను తిప్పే సామర్థ్యం కలిగి ఉండటం పెద్ద ప్లస్ పాయింట్.

ఈ సీజన్‌లో ముంబయి ఇండియన్స్ మినీ వేలం ద్వారా శార్దూల్ ఠాకూర్, రూథర్‌ఫోర్డ్, మయాంక్ మార్కండేలను కొనుగోలు చేసింది. అలాగే ట్రెంట్ బౌల్ట్, క్వింటన్ డి కాక్, మిచెల్ సాంట్నర్, విల్ జాక్స్ వంటి విదేశీ ప్లేయర్లు జట్టుకు అండగా ఉన్నారు. ముంబయి ఇండియన్స్ 29న వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఈ సీజన్ టైటిల్ వేటను ప్రారంభించనుంది. హెడ్ కోచ్ మహేలా జయవర్ధనే రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై నమ్మకంతో ఉన్నాడు. తిలక్ వర్మ, నమన్ ధీర్ వంటి యువ ఆటగాళ్లు మధ్యక్రమంలో కొత్త ఉత్సాహాన్ని తీసుకురానున్నారు. మొత్తంగా చూస్తే, ముంబయి ఇండియన్స్ జట్టు సమతుల్యత, అనుభవం, మ్యాచ్ విన్నర్ల వల్ల ఈసారి ట్రోఫీ గెలిచే ప్రధాన ఫేవరెట్‌గా నిలుస్తోంది. వారు తమ పూర్తి సామర్థ్యంతో ఆడితే, ఇతర జట్లకు ఛాన్స్ ఇవ్వకుండా విజయాన్ని సాధించే అవకాశముంది.

### ఫైనల్‌కు చేరితే టైటిల్ ఖాయం..

ముంబయి ఇండియన్స్ 18 సీజన్లలో 6సార్లు ఫైనల్‌కు చేరి ఐదుసార్లు టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2010లో తొలిసారి ఫైనల్‌కు చేరి రన్నరప్‌కే పరిమితమైన ముంబయి.. ఆ తర్వాత 2013, 2015, 2017, 2019, 2020లలో టైటిల్ విజేతగా నిలిచింది. ఆ తర్వాత సీజన్‌లలో ఘోరంగా విఫలమైనా.. 2023, 2025లలో 3వ స్థానానికే పరిమితమైంది. అత్యంత ప్రజాదరణ గల ఐపిఎల్ జట్లలో ఒకటైన ముంబయి.. ప్రతి సీజన్‌లోనూ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగి అభిమానులను మన్ననలను పొందుతోంది.

ముంబయి ఇండియన్స్ జట్టు: హార్దిక్, రోహిత్, సూర్యకుమార్, తిలక్ వర్మ,రికెల్టన్, రాబిన్ మింజ్, రాజ్ బావా, రఘు శర్మ, మిచెల్ శాంట్నర్, కార్బిన్ బాష్, నమన్ ధీర్, బుమ్రా, బౌల్ట్, గజన్ఫర్, అశ్వని కుమార్, దీపక్ చాహర్, విల్ జాక్స్, రూథర్‌ఫోర్డ్, మార్కండే, శార్దూల్ ఠాకూర్, డి-కాక్, మలేవార్, ఇజార్, అంకోలేకర్, మయాంక్ రావత్.

# విరాట్ కోహ్లి ప్రాక్టీస్ ప్రారంభం



**బెంగళూరు:** ఐపీఎల్-2026 సీజన్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సన్నద్ధ మవుతున్నాడు. బుధవారం ఆర్సీబీ జట్టుతో చేరిన కోహ్లి.. తన తొలి నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో తీవ్రంగా శ్రమించాడు. గురు వారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కోహ్లి తన ట్రేడ్‌మార్క్ షాట్లతో అలరించాడు. ముఖ్యంగా ఫుట్ వర్క్ ఉపయోగిస్తూ ముందుకు వచ్చి మరి భారీ షాట్లతో విరుచుపడ్డాడు. దాదాపు ఏడాది నుంచి కేవలం వన్డేలకు పరిమితమైన కోహ్లి.. ఇప్పుడు టి20 ఫార్మాట్‌కు తగ్గట్టుగా తన బ్యాటింగ్‌ను మలుచుకోవడం విశేషం. అయితే కోహ్లి ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన కోహ్లి.. 151 సగటుతో 302 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. ఆ తర్వాత న్యూజిలాండ్‌పై కూడా తన ఫామ్‌ను కొనసాగించాడు. 3 మ్యాచ్‌ల్లో 80 సగటుతో 240 పరుగులు చేశాడు. ఇప్పుడు అదే జోరును ఐపిఎల్‌లో కూడా కొనసాగించాలని కింగ్ ఉవ్విళ్లూరుతున్నాడు. గత సీజన్‌లో 15 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి 657 పరుగులు చేసి ఆర్సీబీ తరఫున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. దీంతో ఆర్సీబీ తొలి టైటిల్ గెలవడంలో కోహ్లి కీలకపాత్ర పోషించాడు. ఆర్సీబి తమ తొలి మ్యాచ్‌లో 28న చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది.

## ప్రజల సమస్యలు పరిష్కరించడానికి
# ప్రతి ఒక్కరూ పని చేయాలి..

- అభివృద్ధిని వైసీపీ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గం
- వార్డుల్లో తిరగండి ... ప్రజల మనసులు గెలవండి
- పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే కాలవ దిశా నిర్దేశం





**రాయదుర్గం - సూర్య వాస్తవం :** బద్ధకం మంచిది కాదని, కష్టపడితేనే భవిష్యత్తులో రాణించ గలుగుతారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు హితోపదేశం చేశారు. వార్డుల్లో తిరుగుతూ ప్రజల మనసులు గెలవడానికి శ్రమించాలన్నారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం తాజామాజీ కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, అధికార పక్షంలో పని చేస్తున్నప్పుడు ఎవరి హోదాకు తగ్గ స్థాయిలో వారికి ఒత్తిళ్లు తప్పక ఉంటాయని గుర్తు చేశారు. మనస్థాయికి తగ్గ ఇబ్బందులు మనకు ఉంటే, ముఖ్యమంత్రి స్థాయికి తగ్గ ఇబ్బందులు, ఒత్తిళ్లు ఆయనకు ఉంటాయన్నారు. మరోవైపు ప్రభుత్వం చేయాల నుకున్న పనులను వైకాపా దుష్ట శక్తులు అనునిత్యం అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటాయన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ప్రత్యర్థుల సవాళ్లను, అవరోధాలను అధిగమిస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేయాల నుకున్న మంచి పనులు చేస్తూ... చంద్రబాబు నాయక త్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఏ ఏ రంగాల్లో ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించి వాటి పరిష్కారానికి తాను ఏ విధంగా అయితే చర్యలు తీసుకుంటున్నానో.. మీమీ వార్డుల పరిధిలో మీరు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కనీసం వారానికి మూడు, నాలుగు రోజులైనా రోజుకు రెండు గంటల పాటు వార్డుల్లో తిరగడానికి సమయం కేటాయించా లన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ అందుతు న్నాయో..? లేదో..? విచారించాలన్నారు. ఎక్కడైనా నిజమైన అర్హులకు అందకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. రాయదుర్గం పట్టణంలో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టడం జరుగు తోందన్నారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, మంచినీటి సౌకర్యం, వీధి దీపాల ఏర్పాటు లాంటి అనేక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వార్డుల్లో అవసరమైన పనులను గుర్తించి సంబంధిత అధికారుల ద్వారా అభివృద్ధికి దోహదపడాలన్నారు. అప్పుడే ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించటానికి వీలవుతుందన్నారు. స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో మీ మీ వార్డుల పరిధిలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మెరుగైన సంబంధాలు కొనసాగించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తప్పక అన్ని స్థానాల్లో విజయం సాధించే విధంగా బలం పుంజు కోవాలన్నారు. అప్పుడే తనతో పాటు అందరికీ ఎలాంటి సమస్య ఉండదని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మాజీ కౌన్సిలర్లు కురుబ ప్రశాంతి, బుళ్లారి జ్యోతి, బండి భారతి, టంక శాల హనుమంతు, పోరాళ్ల పురుషోత్తం, పసుపులేటి నాగరాజు, పూజారి తిప్పయ్య, సంపత్ కుమారి, ఉమ, సుమలత, వేణు, కరెన్న, భలే శంకర్, పోరాళ్ల ధనర్జున, ఆనంద్, వై. వెంక టేశులు, గుద్దిటి లోకేష్,ఆటో వెంకటేశులు, ఖలందర్, ఎల్లప్ప, రాజశేజర్ తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా భైరవాణి తిప్ప ప్రాజెక్టు పనులు

- రాయలసీమకు కృష్ణా జలాలు అందిస్తున్న హంద్రీనీవా...
- జగన్ పరిపాలనలో రాష్ట్రం సర్వనాశనం
- శ్రీరామకృష్ణయ్య సేవలు మరువలేనివి
- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం- సూర్య వాస్తవం:** ప్రముఖ సాంకేతిక నిపుణులు శ్రీరామ కృష్ణయ్య రాయలసీమ ప్రాంత సాగునీటి రంగానికి ఎనలేని సేవలు అందించారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్ర వారం శ్రీరామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతానికి నది జలాల తరలింపులో ఆయన కీలక భూమిక పోషించారన్నారు. మూడున్నర దశాబ్దాల పాటు సాగునీటి రంగంలో సేవలందించి, పదవీ విరమణ తర్వాత కూడా అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీరామారావుకు సాంకేతిక సలహాదారుగా పని చేశారన్నారు. నేడు రాయలసీమకు కృష్ణా జలాలు అందిస్తున్న హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన మహనీయుడు ఆయనన్నారు. ఎగువ ప్రాంతానికి కృష్ణా మిగులు జలాలు ఎలా తరలించవచ్చో అప్పటి ముఖ్యమంత్రికి సాంకేతిక సలహాలు ఇచ్చారన్నారు. ఆయన అందించిన సూచనలతోనే ఎన్టీరామారావుపై ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ప్రాజెక్టులను కొనసాగించారన్నారు. నేడు సీమలో అనేక ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయంటే దానికి ఆధ్యుడు ఆయనేనన్నారు. నేడు రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని భైరవాణితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించే పనులు వేగంగా జరుగుతున్నాయంటే, ఆనాడు ఆయన రూపొందించిన హంద్రీనీవానే కారణ మన్నారు. ఆయన ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానం రాయలసీమకు గొప్ప వరమన్నారు. శ్రీరామకృష్ణయ్య చేసిన కృషిని పదిమందికి తెలియజేసేందుకు త్వరలో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎమ్మెల్యే కాలవ తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మాజీ కౌన్సిలర్లు కురుబ ప్రశాంతి, బుళ్లారి జ్యోతి, బండి భారతి, టశీకశాల హనుమంతు, పోరాళ్ల పురుషోత్తం, పసుపులేటి నాగరాజు, పూజారి తిప్పయ్య, సంపత్ కుమారి, ఉమ, సుమలత, వేణు, కరెన్న,భలే శంకర్, పోరాళ్ల ధనర్జున, ఆనంద్, వై. వెంకటేశులు, గుద్దిటి లోకేష్,ఆటో వెంకటేశులు,ఖలందర్, ఎల్లప్ప, రాజశేజర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి దేవస్థాన నిర్మాణానికి నిధులు

- బీటెక్ రవి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన 15 కుటుంబాలు



**వేంపల్లె - సూర్య వాస్తవం:** పులివెందుల నియోజక వర్గంలోని వేంపల్లి హరిజనవాడలో శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరులో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి కీలక పాత్ర పోషించారు. దేవస్థానం నిర్మాణానికి అవసర మైన మిగిలిన నిధులను కూడా బీటెక్ రవి, కొంతమంది దాతల సహకారంతో సమకూర్చి ఆలయాన్ని శ్రేష్ఠంగా నిర్మిస్తామని బీటెక్ రవి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా, హరిజనవాడకు చెందిన 15 కుటుంబాలు వైకాపా నుంచి బీటెక్ రవి సమక్షంలో టీడీపీ లోకి చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు, నియోజక వర్గం లో బీటెక్ రవి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి టీడీపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, కన్వీనర్ రామ మునిరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బాలస్వామి రెడ్డి, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు వేమకుమార్, స్థానిక నాయకులు, కాలనీవాసులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.






## మానవత్వం చాటుకున్న సాదిక్ డాన్

### - రూ. లక్ష 50 వేల ఉచిత ఫ్రీజర్ బాక్స్ వితరణ...



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణానికి చెందిన దాత సాదిక్ డాన్ సుమారు రూ.లక్ష 50 వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను బహూకరించారు. అనంతపురం ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్హాజ్ కె.యం.షకీల్ షఫీ ఆధ్వర్యంలో, ప్రముఖ దాత సాదిక్ డాన్ సౌజన్యంతో ఎర్రనేలకొట్టాల లోని మదీనా మసీదుకు శుక్రవారం నాడు ఉచిత ఫ్రీజర్ బాక్స్ వితరణ చేయడం జరిగింది. సాదిక్ డాన్ సామాజిక బాధ్యతగా ఈ ఫ్రీజర్ బాక్స్‌ను అందించారు. ఈ ఫ్రీజర్ బాక్స్ సేవలను కులమతాలకు అతీతంగా అవసరమున్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని షకీల్ షఫీ కోరారు. ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సాదిక్ డాన్‌కి మదీనా మసీదు జమాత్, కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సంపూర్ణ అవగాహనతోనే మహిళా సాధికారత సాధ్యం



**అనంతపురం - సూర్య వాస్తవం :** విద్యావంతులై అన్ని అంశాల్లో సంపూర్ణ అవగాహన పెంచుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమని మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్ బీ. ఎన్.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ పీడీ ఎం.శ్రీదేవి ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని చంద్రబాబు నాయుడు కొట్టాలలోని అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్ వైజర్ భారతి సమక్షంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎన్ శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళల హక్కులు, భద్రత, ఆరోగ్యం, విద్య, స్వావలంబన, సమానత్వం వంటి అంశాలపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు 20 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివక్షను నిర్మూలించడం, చట్టపరమైన హక్కులపై వి జ్ఞానం పెంపొందించుకోవడం మహిళా సాధికారతకు తోడ్పడే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా విస్తృత అవగాహన కోసం సమావేశాలు, ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శాంతా మణి, సిబ్బంది మంజుల, రాజ్యలక్ష్మి, డీసీసీ లీగల్ కౌన్సిలర్ నర్మద, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

## నేలకొరిగిన అరటి తోటలను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**శింగనమల- సూర్య వాస్తవం :** నార్పల మండలం గంగనపల్లి గ్రామంలో ఈదురుగాలులు, అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పలు అరటి తోటలను శింగన మల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రైతులకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటాయని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

## ఆర్‌డీటి పరిరక్షణ కోసం చేపట్టే పాదయాత్రకు ఆర్థిక సాయం

**- రూ.50 వేలు అందజేసిన మౌలానా**



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ సంస్థ పరిరక్షణ కోసం ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు భారీ మద్దతుతో పాదయాత్రలు, ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నా సంగతి తెలిసిందే... ఆర్డిటి పరిరక్షణ ఉద్యమంలో భాగంగామౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... దశాబ్దాలుగా విద్య, వైద్యం, వికలాంగుల సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థను రక్షించుకోవలని తెలిపారు.

## శస్త్రా కోచింగ్ విద్యార్థి సంజయ్ కృపకు నవోదయలో మెరుగైన ఫలితం


**- నాయుడుపేటకు గౌరవం తీసుకువచ్చిన విద్యార్థి**
**- ఆనందంలో తల్లిదండ్రులు**



**నాయుడుపేట - సూర్య వాస్తవం:** జవహర్ నవోదయ 2026 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో నాయుడుపేట పట్టణానికి చెందిన తిన్నెలపూడి సంజయ్ కృప ప్రతిభ కనబరిచి మెరుగైన మార్కులు సాధించారు. శస్త్రా కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఆయన 88.75 మార్కులు సాధించడం విశేషం. ఈ విజయంపై శ్రీవేమ విద్యాసంస్థల కరస్పాండెంట్ పెమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు కష్టపడి చదవడంతో పాటు సరైన మార్గదర్శకత్వం పొందితే రాష్ట్రస్థాయిలో మంచి ఫలితాలు సాధించగలరని ఆయన పేర్కొన్నారు. శస్త్రా కోచింగ్ సెంటర్ అందిస్తున్న శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతోందన్నారు. శస్త్రా కోచింగ్ సెంటర్ అధినేత ఎల్. హరనాథ్ బాబు మాట్లాడుతూ, ప్రవేశ పరీక్షలకు ప్రత్యేకంగా రూపకల్పన చేసిన బోధన విధానం వల్లే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. సంజయ్ కృప విజయంపై అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తమ కుమారుడు సాధించిన ఫలితంపై ఆనందంగా ఉందని, ఉపాధ్యాయులు అందించిన సహకారం మరువ లేనిదని చెప్పారు. ఈ సందర్భంగా సంజయ్ కృపను శ్రీవేమ జూనియర్ కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జ్ కవిత, ప్రిన్సిపాల్ పద్మిణి, ఏఓ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్యకేసుపై అవినాష్ రెడ్డికి మాట్లాడే అర్హతే లేదు

**- ఎంపి అవినాష్ రెడ్డి ప్రెస్‌మీట్‌లు ఆస్కార్ అవార్డులిచ్చే రేంజ్**
**- బిటెక్ రవి సంచలన ఆరోపణలు**



**వేంపల్లె -సూర్య వాస్తవం :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసు విషయంపై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికీ మాట్లాడేందుకు అర్హతే లేదని తెలుగుదేశం పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇంచార్జీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండెపోటు అనే పదాన్ని వాడుకున్నది ఎంపీ వైఎస్ అవినాష్ అని, స్పాట్ పెట్టింది, స్పాట్‌కు పోయింది, స్పాట్ లో క్లీన్ చేసింది వారేనని సంచలన ఆరోపణలు చేశారు. కడప ఎంపి ప్రెస్ మీట్‌లు చూస్తుంటే ఆస్కార్ అవార్డులు ఇచ్చే రేంజ్ లో ఉన్నాయని, అసలు సెక్షన్ 201 అంటే తెలుసా అని బిటెక్ రవి ప్రశ్నించారు. హత్య జరిగిందని తెలిసి సాక్ష్యాలను తారుమారు చేసిన అవినాష్ రెడ్డి తప్పించుకుని ప్రసక్తే లేదన్నారు. అలాగే వైఎస్ వివేకా కుమార్తె సునీతరెడ్డి గుండెపోటు చెప్పిందని ఆమెపై ప్రచారం చేయడం తగదన్నారు. ఏపి సిఎం చంద్రబాబుకు, సునీతరెడ్డి సహకారం ఎందుకని మండిపడ్డారు. ఒకవేళ సునీతకు రాజకీయ కోరిక ఉండింటే ఎంపిగా అవినాష్ రెడ్డి ఈరోజు ఉండేవారు కాదని, ఎంపి పదవి సునీత పెట్టిన బిక్ష అన్నారు. ఇప్పటికే కోర్టుల చుట్టూ అవినాష్ రెడ్డి తిరుగుతున్నారని, కర్మ సిద్ధాంతం కచ్చితంగా ఉందని, అందులోంచి తప్పించుకునే ప్రసక్తే లేదన్నారు. అంతేకాకుండా సిఐ అశోక్ రెడ్డి పెద్ద అవినీతి పరుడని, ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయాన్ని వెల్లడించారు.

# జిల్లావ్యాప్తంగా పటిష్ఠ పోలీస్ బందోబస్తు

- నిఘాలో డ్రోన్లు, సీసీ కెమెరాలు
- శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని పిలుపు
- సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** కఠినమైన రంజాన్ ఉపవాస దీక్షలు ముగించుకుని, శనివారం (మార్చి 21) 'ఈద్-ఉల్-ఫితర్' జరుపుకోనున్న ముస్లిం సోదర సోదరీమణులకు అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ భద్రతా ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని మసీదులు, ఈద్గాహ్‌ల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాం. ప్రార్థనల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసు కున్నాం. పండుగ ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచు తున్నాం. సోషల్ మీడియా వేదికలపై ఎవరైనా మత విద్వేషాలు లేదా వదంతులు వ్యాప్తి చేస్తే, సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్లపై కూడా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సర్వమత సమ్మేళనానికి ప్రతీక అయిన మన దేశంలో, ఒకరి భావాలను మరొకరు గౌర వించుకుంటూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ముస్లిం సోదరీ సోదరులకు మరియు పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ 'రంజాన్' పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రకృతి వ్యవసాయ పొలాల పరిశీలన

**- శాస్త్రవేత్త నటాషా ఎడ్వార్డ్ లండన్**



**లింగాల - సూర్య వాస్తవం:** లింగాల మండలంలోని అక్కులుపల్లెలో రైతు నరాలఉదయ్ కృష్ణారెడ్డి పొలాన్ని లండన్ దేశానికి చెందిన శాస్త్రవేత్త ఐతీ నాటాశా ఎడ్వార్డ్ విజిట్ చేయడం జరిగింది. అలాగే ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రమును విజిట్ చేయడంఅందులోని ప్రకృతి కషాయాలు ద్రావణాలు, గ్రోత్ ప్రమోటర్స్, బయో ఎంజైమ్స్, వర్మీ వాష్, వివిధ రకాల విత్తనాలు, వాటి వల్ల ఉపయోగాలను, ఏ కషాయం ద్రావణం మొదలగు ఇన్పుట్స్ను ఏ విధంగా తయారు చేస్తారుఎంత మోతాదులో ఎంత విస్తీర్ణానికి పిచకారి చేసుకోవచ్చు అనే విషయాన్ని బిఆర్‌సి ( బయో రీసెర్చ్ సెంటర్ ) ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం యజమాని ఉదయ కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకోవడం జరిగింది. అలాగే లింగాల మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరిని వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ వివరాలను ఇంగ్లీషులో ట్రాన్స్లేట్ చేస్తూ ఐతీ పుష్ప మండలంలోని సిబ్బంది ఎన్ని ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నారు, తమ సొంత పొలాలు ఎన్ని ఎకరాల్లో చేస్తున్నారు. ఎంత కాలం నుంచి ఈ వ్యవసాయం చేస్తున్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరితోఅడిగి తెలుసుకుని నటాషాఎడ్వార్డ్ కి ఐతీ పుష్ప మేడం వివరించారు. అలాగే పిఎమ్‌డిఎస్ అంటే ఏమిటి, విత్తన గుళికలను ఏ విధంగా తయారు చేస్తారు, కావలసిన పదార్థాలు ఏవి, విత్తనగులికలను ఎప్పుడు చల్లాలి లేదా విత్తాలి, అనే విషయాలను మాస్టర్ ట్రై నర్ భాస్కరరెడ్డి తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో లండన్ దేశ శాస్త్రవేత్త నటాషా ఎడ్వర్డ్‌తో పాటు పుష్ప, డివిజనల్ ఎంటీ భాస్కరెడ్డి, మండల ఇన్‌చార్జి జయ నాయక్, డిఎంఎంటి యామిని లత, ఐసిఆర్‌పిలు యశోద, వి. జయలక్ష్మి, బాదుల్లాబి, వెంకటరమణ, రవి, శోభారాణి, యూ.శోభ, హరిత, నాగేంద్రమ్మ, గంగాభవాని, మునిలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి

**- నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు నైరుతి రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకేశవరెడ్డి**

**పామిడి -సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలంలో మొన్న కురిసిన గాలివానకు అరటి మొక్కజొన్న పంటలను జి కొట్టాల సుదర్శన్ రెడ్డి అనే రైతు 5ఎకరాల మొక్క జొన్న విపరీతమైన గాలివానకు వానకు నేలకు ఓరిగిన విషయం తెలుసుకున్న వైస్సార్సీపీ జిల్లా ఉపఅధ్యక్షురాలు"నైరుతి రెడ్డి రైతు పొలానికి వెళ్లి పరిశీలించారు. అలాగే జిల్లా నాయకులు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ, పామిడి చెన్నకేశవ రెడ్డి ,రైతు విభాగం బాబు రావు, రాష్ట్ర కార్యదర్శి కింగ్, కొండాపురం సునీల్ రెడ్డి, పామిడి పట్టణ కన్వీనర్, నాగూర్ ఈశ్వర్ రెడ్డి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పామిడి సూరి , ముకుంద రెడ్డి సాగర్ రెడ్డి, గజనంపల్లి దేవేందర్, టౌన్ ఉపాధ్యక్షులు, తుల్లా భాయ్, ఈ భూది కాసిం శంకర్ నారాయణ నరసింహ రామ్ రెడ్డి నక్కఓబులేసు రామ్మోహన్, సుదర్శన్ రెడ్డి బిసి అధ్యక్షులు, ఓబులేసు, కాలాపురం నార్ప రెడ్డి ,బీసీ సెల్ అధ్యక్షులు రంగనాయకులు, రాజా రెడ్డి, బోర్ల పుల్లయ్య, సోషల్ మీడియా ఉమేష్, సాయి, శాసు, ఖలీల్, ఉదయ్, వైఎస్ఆర్సిపి, పామిడి మండలం నాయకులు, గ్రామానికి సంబంధించిన నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు

**- జిల్లా కార్యదర్శి అల్లం బాబు**
**- పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ**
**- పార్టీ బలోపేతంపై చర్చలు**



**పెళ్లకూరు-సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ టిడ్కో ఛైర్మన్, జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్‌ను గూడూరు పార్టీ కార్యాలయంలో కోట వాకాడు జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అల్లం బాబు ఆధ్వర్యంలో నాయకులు కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, మున్నా సతీష్, జూబేర్, ఐటీ మహేష్, డెనీ తది తరులు పాల్గొన్నారు. అజయ్ కుమార్ సేవలను ప్రశంసిస్తూ, పార్టీ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చించుకున్నారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ నాయకుల ఉత్సాహం, ఐక్యత స్పష్టంగా కనిపించాయి.

## శ్రీపరాభవ నామ ఉగాది - పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు

**- వైసీపీ మండల పరిశీలకులు వేల్పుల రాము**



**వేముల - సూర్య వాస్తవం :** తెలుగు నూతన సంవత్సరం మండల ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు ఆయు రారోగ్యాలు నింపాలని, అదేవిధంగా పవిత్ర రంజాన్ ముస్లిం సోదర సోదరీ మణులకు అల్లా దీవెనలు కలగాలని రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని వైసిపి మండల పరిశీలకులు వేల్పుల రాము కోరారు. ఈ సందర్భంగా వేల్పుల రాము మాట్లాడుతూ ఈ పండుగలు మన మండలం లో సమైక్యతకు సోదర భావానికి ప్రతీకగా నిలవాలని, ప్రతి ఇంటిలో సుఖశాంతులు ఆయురారోగ్యాలు సకల శుభాలు కలగాలని, మండల ప్రజలకు, వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు, పోలీసు కుటుంబాలకు, ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు వేల్పుల రాము తెలియజేశారు.